శ్రీ సాయి సచ్చరిత్ర

నిత్యపారాయణ గ్రంథం

ఆరవరోజు పారాయణ-మంగళవారము

యిరువది ఎనిమిదవ అధ్యాయము

బూటీ శ్యామా, కాకాసాహెబ్ దీక్షిత్ మొదలగు వారి సలహా సహాయములతో వాడా నిర్మాణమునకు కావలసిన రాళ్ళు, సున్నము పనివారలను సిద్ధము చేసుకొనెను. 1913 డిసెంబరు 30వ తేదీన శంకుస్థాపన చేసి పనిని ప్రారంభించిన బాగుండునని అనుకొనిరి. బాబాకూడ సమ్మతించెను. కట్టుట ప్రారంభించబడెను. శ్యామాపర్యవేక్షణ చేయుచుండెను. భూగృహము, భూ ఉపరిగృహము, బావి మొదలగునవి పూర్తి కావచ్చెను. బాబా కూడ ప్రతిరోజు లెండీబాగ్‌కు పోవునప్పుడు, తిరిగివచ్చునప్పుడు కట్టడము పనిని చూస్తువుండేవాడు. అప్పుడప్పుడు బాబా కొన్ని మార్పులను, సలహాలను సూచిస్తూ వుండేవారు. క్రమముగా పనివారికి కూడ బాబా యందు భక్తి విశ్వాసములు కుదిరినవి. వారు కూడ పని ప్రారంభించుటకు ముందు, పనిపూర్తి అయిన తరువాత బాబాకు నమస్కరిస్తూ వుండేవారు. కట్టడపు సామానులు, సామాగ్రి బాపూసాహెబ్ జోగు జాగ్రత్త పరచుచుండెడివాడు. బాబా ఆశీస్సులచే కట్టడము త్వరత్వరగా పైకిలేచుచుండెను. పనివారలు కూడ బాబా ప్రభావముచే అది యొక పవిత్ర యజ్ఞముగా భావించి పనిచేయుచుండిరి.

మధ్య గల విశాలమైన పెద్ద హాలులో శ్రీకృష్ణుని విగ్రహమును ప్రతిష్టించవలెనని బూటీ తొందరపడుచుండెను. విగ్రహము తయారు చేయించుటకు బూటీ బాబాను అనుమతి కోరగా బాబా నిరాకరించి ఈ దేవాలయము కట్టుట పూర్తి కాగానే నేను అక్కడకు వచ్చి నివసించెదను. దీనిని మనమే ఉపయోగించుకొనవలెను. మనమందరము ఇక్కడే వుందుము. మనమందరము కలిసి మెలసి దీనిలో ఆడుకొనెదము. ఒకరినొకరు కౌలిగించుకొని యిందులో హాయిగా వుండెదమని బాబా చెప్పెను. మరి యొకసారి శ్రీకృష్ణుని విగ్రహం కోసం ఏర్పాటు చేసిన గద్దె పయి బాబా తనదైన పద్ధతిలో కాలుమీద కాలు వేసుకుని కూర్చొనగా మరల బూటీ కృష్ణ విగ్రహమును తయారు చేయించుటకు అనుమతినిమ్మని కోరెను. నీ కృష్ణుడిని నేను కాదా! విగ్రహమును ప్రతిష్టించవచ్చునులే, కొంతకాలము ఓర్పు వహించమని బాబా చెప్పెను. నిగూఢముగా బాబా పలికిన ఈ మాటల అర్ధము అప్పుడు ఎవరికీ

తెలియలేదు. ఈ విధముగా బూటీ నిర్మించు మందిరము క్రమక్రమముగాను త్వరగాను అభివృద్ధి చెందుతునే యున్నది. బాబా తన భక్తులను ఏదైనా విషయమును చెప్పవలెననిన దానికి సంబంధించిన ఏర్పాటులన్నిటిని వారే చేసెడివారు. స్వప్న రూపములో చెప్పెడివారు. వారి స్వప్నములకు కాల నియమములేదు.

రాహటా నివాసి కుశాలచంద్

ఒకరోజు సాయంత్రము బాబా కాకా దీక్షిత్‌ను రహటాకు పోయి కుశాల్ చందును తీసుకురావలసినదని చెప్పెను. అతనిని చూచి చాలా రోజులగుటచే బాబా అతనిని తీసుకురమ్మని చెప్పెను. టాంగాను తీసుకుని రహటా వెళ్ళి కుశాల్ చంద్‌కు బాబా యొక్క కబురు చెప్పునప్పటికి అతడు షిరిడి వచ్చుటకు ప్రయాణమై వుండెను. మధ్యాన్నము నిద్రించునప్పుడు బాబా కలలో కనిపించి వెంటనే షిరిడికి రమ్మనమని చెప్పుటచే అతడు ప్రయాణమునకు సిద్ధమై వుండగా వెంటనే బయలుదేరి యిద్దరూ షిరిడికి వచ్చిరి. బాబా తనపై చూపు ఈ ప్రేమకు కుశాల్ చంద్ మనస్సు కరిగెను.

బొంబాయి నివాసి పంజాబి రాంలాల్

ఒకరోజు బాబా ఈతనికి మహంతువలె కనిపించి తన వద్దకు రమ్మని చెప్పెను. కాని అతనికి ఈ మహంతు ఎవరో ఎక్కడ వుండెదరో తెలియదు. ఆ సాయంత్రం అతడు వీధిలో పోవుచుండగా అయస్కాంతమువలె ఒక దుకాణములో గల బాబా ఫోటో అతని దృష్టిని ఆకర్షించెను. రాత్రి తనకు కలలో కనపడిన మహంతు ఇతడేనని వివరములడిగి తెలుసుకుని షిరిడికి చేరెను. అంత్యకాలము వరకు అతడు షిరిడిలోనే వుండెను.

విజయానంద్

యితడు మద్రాసు దేశపు సన్యాసి. మానస సరోవరము యాత్రకై బయలుదేరి మధ్యలో షిరిడిలో ఆగి కొన్నిరోజులుండెను. హరిద్వారము నుంచి వచ్చిన సోమదేవస్వామియు అప్పుడచట నుండుటచే యాత్రా వివరములను అడిగి తెలుసుకొనెను. ఆ యాత్ర చాలా కష్టసాధ్యమని విరమించుకొని బాబా వద్దకేగి సాష్టాంగ నమస్కారమును చేయగా బాబా కోపగించి ఈ పనికిమాలిన సన్యాసి స్నేహము మనకు మంచిదికాదు. యితనిని తరిమివేయుడని చెప్పెను. యాత్రకు బయలుదేరిన తరువాత కష్టమనిపించి మధ్యలోనే విరమించుకొనుట ఉత్తముల

స్వభావము కాదు. ప్రారంభించిన పనిని కష్టనష్టము లెదురైనను లెక్కచేయక పూర్తి చేయవలెను. యిదే ధీరుల, ఉత్తముల లక్షణము. ఆధ్యాత్మిక విషయములలో కూడ యిదే వర్తించును. అందువలననే అతనిని పనికిమాలిన సన్యాసియని సంబోధించెను. అతనిపై బాబా కోపగించినప్పటికి అతనికి బాబాయందు ప్రేమ తగ్గలేదు. మసీదులో ఒక ప్రక్క కూర్చుని అక్కడ జరుగు కార్యక్రమును జాగ్రత్తగా పరిశీలించెను.

ఉదయమున జరుగు దర్బారు సమయములో భక్తులు క్రిక్కిరిసియుండిరి. బాబాను అనేక విధముల పూజించుచుండిరి. కొందరు వారి పాదముల కభిషేకము చేయుచుండిరి. వారి కాలి బొటనవ్రేలు పైనుంచి క్రిందపడు తీర్థమును కొందరు త్రాగుచుండిరి. కొందరు వారి పాదములను కళ్ళకద్దుకొనుచుండిరి. కొందరు వారి పాదాభిషేక జలమును చెంబులలో నింపుకుని తిరిగి వెళ్ళునప్పుడు యిండ్లకు తీసుకువెళ్ళుచుండిరి. కొందరు మెడపైన, చేతులకు చందనము పూయుచుండిరి. యింకొందరు వారి అంగీపై అత్తరును పూయుచుండిరి. కొందరు బాబా మెడలో పూలమాలలు వేయుచుండిరి. మరి కొందరు పాదములపై పూలను జల్లుచుండిరి. మధ్యలో కొందరు వారికి కర్పూర ఆరతిని యిచ్చుచుండిరి. అప్పుడప్పుడు బాబా తలపై కఫ్నీని సరి చేసుకొనుచుండెను. కొందరు భక్తులను తల నిమిరి ఆశీర్వదించు చుండెను. చిన్నపిల్లలు వారికి మ్రొక్కినప్పుడు ప్రక్కనే గల పెద్దసైజు బుట్టలో నుంచి దోసిటి నిండా కోవాబిళ్ళలను తీసి వారికి యిచ్చుచుండెను. మరికొందరు చిన్న పిల్లలను తన తొడపై కూర్చొపెట్టుకుని తానే వారికి స్వయంగా కోవాబిళ్ళలను నోటిలో పెట్టుచుండెను. కులమత, జాతి విచక్షణలు ఆడ, మగ తేడాలు లేక సర్వులు యధేచ్ఛగా బాబాను సేవించి, పూజించి, అర్చించుచున్న ఆ వింత దృశ్యము చూసిన విజయానంద్‌కు ఆ స్థలమును విడిచి పెట్టుటకు మనసు రాక షిరిడిలోనే కొంత కాలముండెను.

ఒకరోజు అతని తల్లికి జబ్బుగా వున్నదని అతని పేరున షిరిడికి వుత్తరము వచ్చెను. బాబాను దర్శించి యింటికి వెళ్ళుటకు అనుమతిని కోరెను. కాని అతని జీవిత గమనము యింకొక విధముగా వుండుటచే బాబా అతనికి అనుమతిని నిరాకరించి, "తల్లిని అంతగా ప్రేమించువాడవు సన్యాసమెందుకు తీసుకుంటివి? ఒక్కసారి కాషాయ వస్త్రములు ధరించిన పిదప యిక దేని యందును అభిమానము చూపరాదు. యిదే కాషాయవస్త్రముల ప్రాధాన్యత. వాడాలో పెక్కు దొంగలున్నారు.

తలుపు గడియ వేసుకుని జాగ్రత్తగా పడుకొనుము. దొంగలు వున్నదంతయు దోచుకుని పోయెదరు. ధనము ఐశ్వర్యము, మొదలగునవి శాశ్వతములు కావు. నీ పూర్వ పుణ్యా మెక్కువగుటచే నీ విక్కడికి రాగలిగితివి, ఎవరు దేముని పాదములను శరణు వేడెదరో వారు అన్ని కష్టముల నుంచి విముక్తి పొందిమోక్షమును పొందెదరు. ఏ విధమైన కోరికలులేని వాడవై భాగవతమును పారాయణ చేయుము, శ్రద్ధగా మూడు సప్తాహములను చేయుము, భగవంతుడు తృప్తి చెంది నీ బాధలను తొలగించునని చెప్పెను.

బాబా ఆదేశానుసారము విజయానందుడు లెండీ తోటలో కూర్చుని ఏకాంతముగా రెండు పారాయణలను చేయగనే అలసిపోయి మూడవ దినమున బడే బాబా తొడపై ప్రాణములు వదిలెను. అతని జీవితమున జరుగు ఈ తుదిఘట్టమును గ్రహించిన బాబా అతనిని తిరిగి ప్రాపంచిక లంపటములో పడనీయక షిరిడిలోనే పవిత్ర గ్రంథ పారాయణ చేయుచూ మరణించునట్లు చేసి సద్గతి కలిగించెను.

మద్రాసు భజనసమాజము

1916లో రామదాసి పద్ధతికి చెందిన భక్తసమాజము. మద్రాసు నుంచి కాశీయాత్ర వెళుతూ మార్గమధ్యమున బాబా పేరు విని షిరిడికి వచ్చెను. ఈ సమాజములో ఒక పురుషుడు, అతని భార్య, కూతురు, వదెనగారు ముఖ్య సభ్యులు. కొద్దిరోజులు షిరిడిలో వుండి ప్రతిరోజు సాయంత్రము చక్కని భజన పాటలు, కీర్తనలు పాడెడివారు. యజమానురాలు మాత్రము నిర్మల ప్రేమస్వభావము కలది. మిగిలిన ముగ్గురు మాత్రము బాబా యిచ్చు కానుకలయందు మాత్రమే దృష్టి గలవారు. యజమానిరాలికి బాబా యందు భక్తి గౌరములు పెరిగి వారిని దర్శించినంతనే ఆనందభాష్పములు కన్నుల నుండి రాలెడివి, ఆమె భక్తికి మెచ్చి ఒకనాటి అరతి సమయములో బాబా ఆమెకు తన యిష్టదైవమైన శ్రీరామునిగా దర్శనమిచ్చెను. మిగిలిన ముగ్గురకు చెప్పగా ఆమె భ్రమపడినదని, చాదస్తమని హేళన చేసిరి.

కొద్దిరోజుల తరువాత ఆమె భర్తకు కూడ ఈ విధముగా ఒక కల వచ్చెను. ఒక పెద్ద పట్టణములో అతడుండగా అక్కడి పోలీసులు అతనిని బంధించిరి. తాడుతో చేతులు కట్టి పంజరములో వుంచిరి. సాయి బాబా పంజరము దగ్గరనే నిలబడియుండెను. అప్పుడతడు సాయితో-నీ పేరు ప్రఖ్యాతులు విని నీ

పాదములాశ్రయించి వచ్చితిని. నీవే స్వయముగా ఇక్కడ వుండగా ఈ ఆపద నాకేల కలిగెనని ప్రశ్నించెను. నీవు చేసిన కర్మ ఫలితమును నీవనుభవించవలెనని బాబా సమాధానమిచ్చెను. నేను తెలియక గత జన్మలో ఏమైనా పాపములను చేసియున్నచో నీ ఎదురుగా వాటిని ఎండు గడ్డివలె కాల్చివేయుమనెను. నీ కట్టి విశ్వాసమున్నదా? అని బాబా అడుగగా గట్టి విశ్వాసమున్నదని అతడు సమాధానమిచ్చెను. అయినచో కళ్ళు మూసుకొనమని బాబా చెప్పెను. అతడు కళ్లు తెరచి చూచునరికి పోలీసులు రక్తము కారుతూ పడియుండిరి. అతడు బంధవిముక్తుడయ్యెను. బాబా అతనితో ఇప్పుడు నీవు బాగుగా పట్టుపడితివి. అధికారులు వచ్చి నిన్ను బంధించెదరనెను. అందుకతడు నీవు తప్ప నన్ను రక్షించువారలులేరు. ఏ విధముగానైనా నీవే నన్ను కాపాడవలెనని ప్రార్థించెను. అయినచో మరల కన్నులు మూయుమని బాబా చెప్పగా అతడు కళ్ళుమూసి తెరచునంతలో అతడు పంజరము నుండి విడుదలై బాబా ప్రక్కనే వుండెను. అప్పుడతడు బాబా పాదములపై పడెను. ఇప్పుడు నీవు చేస్తున్న నమస్కారమునకు యింతకు ముందు నీవు చేసిన నమస్కారమునకు ఏమైనా తేడా వున్నదా యని బాబా అడుగగా అతడు చెప్పలేనంత భేదమున్నది, మొదటి నమస్కారము నీ వద్ద పైకమాసించి చేసినది. కాని ఇప్పుడు చేయు నమస్కారము నీవు దేముడవను భావనతో భక్తితో కూడినదని చెప్పెను. యిప్పుడు నీకింకేమైన కోరిక కలదాయని సాయి మరల ప్రశ్నించెను. తన గురవగు రామదాసును దర్శింపవలెనని కోరికగలదనెను. బాబా వెనుకకు తిరుగుమని చూడగానే అతనికి వెనుకగా అతని గురువు రామదాసు దర్శనమిచ్చి అదృశ్యుడయ్యెను. అతనిలో బాబా యందు ప్రేమకలిగి మీరు చాలా ముసలివారుగా కన్పించుచున్నారే అనెను. నేను ముసలివాడినా! నాతో పరుగెత్తుము అనుచూ బాబా పరుగెత్తుచుండగా శూన్యము లోనికి వెళ్ళి అదృశ్యుడయ్యెను. అంతటితో కల చెదరెను. అతడు నిద్ర నుండి మేల్కొనెను.

ఈ కలను గురించి అతడు చాలా ఆలోచించెను. మొదటగల ధనముపై కోరిక బంధహేతువు. అదే పంజరము. ధనముపై పేరాశగల వానిని ధర్మదేవత దండించును వారే పోలీసులు. అతనికి బాబాయందు విశ్వాసము కుదిరినప్పుడు పంజరము పోయెను. అనగా పేరాశపోయెను. పేరాశ లేనివారిని ధర్మదేవత కూడ ఏమిచేయలేదు. అందువలన పోలీసులు కూడ పడిపోయిరి. బాబా పరుగెత్తి అనంతశూన్యములో కలిసిపోయెను. అతడు బాబా వెనకాలే పరుగు తీసెను. యిది జీవాత్మ పరమాత్మ ననుసరించుట.

ఈ ఒక్క కలద్వారా బాబా అతనికి అనేకమైన విషయములను బోధించి గ్రహించునట్లు చేసెను. యిదే సద్గురువు సమర్థత. ఆ ఉదయం అతను బాబాకు నమస్కరించగా బాబా ఆశీర్వదించి రెండు రూపాయలను, మిఠాయిని యిచ్చి అల్లా నీకు మేలు చేయును. నీకు కావలసినంత ధనము దొరుకునని ఆశీర్వదించెను. బాబా ఆశీర్వాదము ప్రకారము వారి యాత్ర చక్కగా సాగెను. ఆ తరువాత యాత్రలో వారికెంతో ధనము లభించెను. ప్రతి చోట షిరిడి ప్రభువును గూర్చి కొన్ని పాటలను కట్టి పాడిరి. తిరిగి యింటికి చేరిన తరువాత కూడ సాయిబాబా యొక్క ప్రచారమును బాగుగా చేసిరి.

బాబా సీమోల్లంఘన

అది 1916వ సంవత్సరం అక్టోబరు నెల. ఆరోజు విజయదశమి. దసరాపండుగ. ఆనవాయితీ ప్రకారం ఊళ్ళోని వారంతా జమ్మి ఆకులను తీసుకొని పెద్దలకు బంధువులకు గౌరవ సూచకంగాను ప్రేమ పూర్వకంగాను అందిస్తూ సాయంత్రం వేళ వూరి వారందరూ వూరేగింపుగా వూరు పొలిమేరల వరకు వెళ్ళి జమ్మిచెట్టును కొట్టి వచ్చెదరు. సరిహద్దు సీమ గాటువరకు చేయు ఈ కార్యక్రమమును సీమోల్లంఘనము అనెదరు.యిది ప్రతి దసరానాడు ఆ కాలంలో చేయు ఒక సామూహిక పండుగ కార్యక్రమము. ఆనాడు కూడ గ్రామస్థులు బాబా భక్తులు అందరూ కలిసి సీమోల్లంఘన మొనర్చి తిరిగి వచ్చుచుండగా బాబాకు ఉన్నట్టుండి తీవ్రమైన కోపము వచ్చెను. కండ్లు పెద్దవై ఎర్రబడి నిప్పులు కక్కుచున్నట్లుండెను. బాబా శరీరమంతా వేడెక్కెను. వారు తల నున్న కఫినీ, బారు లాల్చి, లంగోటీలను తీసి ముక్కలుగా చించి ధునిలో వేసిరి. అందువలన ధుని మంట పెరిగెను. ఎర్రని ధుని మంటలలో బాబా యొక్క దిగంబర శరీరము మెరయుచుండెను. కనుగుడ్లు అటు యిటు త్రిప్పునప్పుడు కాంతివంతమైన దీపములు కదులుచున్నట్లుండెను. ఈ వింత దృశ్యమును చూచి జనులంతా ద్వారకామాయి ముందు ప్రోగైరి, బాబా వారి వైపుకు తిరిగి యిప్పుడు నన్ను సరిగాచూసి హిందువుడనో, ముస్లిమునో చెప్పండి అని మేఘమువలె గర్జించెను. బాబాయొక్క దిగంబర రూపము, గంభీరమైన వాక్కులు, మెరయు కనుగుడ్లను చూచి అక్కడున్న ప్రతివాడు గడగడా వణికిపోయెను. నోరు మెదపుటకు ఎవరికీ ధైర్యము చాలకుండెను. బాబాయొక్క కోపమును చూచి గాలికూడ భయపడి కదలక నిలచినట్లుండెను. నిశ్శబ్దము తాండవించెను. కొంతసేపటికి భాగోజీషిండే ధైర్యముచేసి బాబావద్దకు వెళ్ళెను. ధైర్యముతో ముందుకు వెళ్ళి లంగోటి కట్టబోయెను. బాబా శరీరము నిప్పు కణికవలె

వేడిగానుండెను. బాబా శరీరపు వేడికి ఎక్కువసేపు తన చేతిని తాకునట్లు వుంచలేకపోయెను. కాలిన వస్తువును తాకినట్లుగా బాధపడుతూ మొత్తము లంగోటీ కట్టుట పూర్తిచేసిన తరువాత యింకొంచెం ధైర్యంతో సీమోల్లంఘుననాడు యిదంతయు ఏమిటి బాబా అని ప్రశ్నించెను. "ఈ రోజు నా సీమోల్లంఘునము" అనుచు అదే వేగముతో నేలపై సటకాతే కొట్టెను. క్రమముగా బాబాకు బారు లాల్చీని తొడిగి కూర్చుండబెట్టెను. తాత్యా వచ్చి బాబాకు మంచి గంధమును వంటినిండా పూసెను. రాత్రి పదిగంటల వరకు బాబా శాంతించలేదు. ఆఖరికి మామూలుగానే చావడి ఉత్సవమునకు తయారయ్యెను. నడచునప్పుడు బాబా కుడిచేతిని ఒకసారి భాగోజీపట్టుకొనెను. అప్పుడు బాబా చేయి మృదువుగా చల్లగానుండెను. ఈనాడు నా సీమోల్లంఘున అన్న బాబా మాటలు ఆనాడు ఎవరికీ సరిగా అర్ధంకాలేదు. కాని బాబా సరిగా రెండు సంవత్సరముల ముందుగా తన జీవితసీమను దాటెదనని సూచించెను. అది వారి సమాధి అయిన తరువాతగాని ఎవరూ తెలుసుకొనలేకపోయిరి.

మానవుడు ఎన్ని పుస్తకములను చదివినా ఎంత మంచి మాటలను విన్నా, ఎంత మంది మంచివారితో కలిసి తిరిగినా మంచి నడవడిని నేర్చుకొనుట, మంచిని ఆచరణలో పెట్టుట చాలా కష్టమగును. యిది మనిషిలోని బలహీనత, ఈ పారాయణచేయు పాఠకులలోగల ఈ బలహీనతలను కూడ ఈనాటితో సీమోల్లంఘున చేయించమని సాయిని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

యిరువది ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

యిరువది తొమ్మిదవ అధ్యాయము

బాలారామ్ మాన్కర్

యితడు భార్యచనిపోయిన తరువాత విరక్తి పొంది కొడుకునకు యింటి భారము అప్పచెప్పి షిరిడికివచ్చి బాబాతో వుండిపోయెను. బాబా అతని భక్తిని మెచ్చుకొనెడివాడు. ఒకసారి సాయి ఈతనికి 12 రూపాయలిచ్చి మచ్చీంద్రగడలో వుండమని రోజుకు మూడుసార్లు ధ్యానము చేయమని చెప్పి పంపెను. అక్కడగల చక్కని ప్రకృతిదృశ్యములు, పరిశుద్ధమైన నీరు, ఆరోగ్యమైన గాలి చూచి మాన్కర్ సంతసించి బాబా ఆదేశము ప్రకారము తీవ్రముగా ధ్యానము చేయుచుండెను.

ఒకనాడు చైతన్యావస్థయందే మాన్కరుకు బాబాదర్శనమిచ్చెను. తనను అచటికేల పంపితిరని అతడు బాబాను అడిగెను. అందుకు బాబా-షిరిడిలో నీ మనసులో అనేకానేక ఆలోచనలు రేగుచుండుటచే నీ చంచల మనస్సును నిలకడ చేయుటకు యిక్కడకు పంపితినని చెప్పెను. ఈ పంచేంద్రియములతో నున్న మూడుమూరల మనిషిగానన్ను ఊహించితివి. నేనెప్పుడూ షిరిడిలోనే వుండెదనని అనుకుంటివి. నీవిప్పుడు చూచిన నా రూపము షిరిడిలో నీవు చూసిన రూపమువలె వున్నదో లేదో చూడుము. యిది నిరూపించుటకే నిన్నిచ్చటికి పంపితిని అని చెప్పెను. కొన్నాళ్ళ తరువాత బాంద్రా వెళ్ళుటకు బయలుదేరి పూనా నుండి దాదరుకు రైలులో వెళ్లుటకు నిశ్చయించుకొనెను. టిక్కెట్టు కొరకు బుకింగ్ ఆఫీసుకు పోగా క్రిక్కిరిసియుండెను. టిక్కెట్టు దొరకలేదు. కంబళి కప్పుకొనిన ఒక పల్లెటూరి వాడు వచ్చి మీరెక్కడకు వెళ్ళుచుంటిరని అడుగగా దాదరుకని చెప్పెను. అతడు మీరు దయతో ఈ నా దాదరు టిక్కెట్టు తీసుకొనుడు. నాకు అవసరమైన పనియుండుటచే మానుకొంటినని దాదరు టిక్కెట్టు అతని చేతిలో పెట్టి, టిక్కెట్టును చూసి తల ఎత్తు లోపల జనంలో కలిసిపోయెను. ఎంత వెతికినను లాభం లేకపోయెను. రైలు కదలు వరకు చూచినను అతని జాడలేదు. యింటికి వెళ్ళి తిరిగి షిరిడికి వచ్చెను. తన అంత్యకాలము వరకు బాబా సన్నిధిలోనే వుండి ఆఖరికి షిరిడిలోనే మరణించిన యితడు నిజముగా అదృష్టవంతుడు.

బూటీ మందిర నిర్మాణము పూర్తియగుట

బూటీ తాను నిర్మించు మందిరమును త్వరగా పూర్తి చేయవలెనను దీక్షతో పనులను తొందరగా పూర్తి చేయించుచుండెను. శ్యామా నిత్యము కట్టడపు పనులను పర్యవేక్షించుచుండగా బాపూసాహెబ్ జోగ్, తాత్యా, రామచంద్ర పాటిల్ మొదలైన భక్తులు ద్విగుణీకృత ఉత్సాహంతో మందిర పనులకు సహకరించుచుండిరి. బాబా అనుగ్రహం వలన 1916 డిసెంబరు నాటికి బూటీవాడ నిర్మాణము పూర్తి అయ్యెను. నగిషీపనులు, చెక్కడములు మాత్రము అక్కడక్కడా మిగిలియుండెను.

వామననార్వేకర్

యితడు బాబాను త్రికరణశుద్ధిగా ప్రేమించు భక్తుడు. ఒకసారి అతడు ఒక రూపాయను తెచ్చెను. దానికి ఒక ప్రక్క సీతారామలక్ష్మణులు, యింకొక ప్రక్క భక్తఆంజనేయుని బొమ్మలు కలవు. దానిని బాబాకిచ్చెను. బాబా దానిని తాకి పవిత్రపరచి ఊదీ ప్రసాదముతో తన కివ్వవలెనని ఆ తరువాత దానిని తన యింటిలో పూజయందుంచుకొనవలెనని అతని కోరిక. కాని బాబా దానిని తన జేబులో వేసుకొనెను. శ్యామా నార్వేకర్ వుద్దేశమును తెల్పి రూపాయి అతనికి తిరిగి యివ్వమని కోరెను. బాబా దీనిని అతనికి ఎందువలన తిరిగి యివ్వవలెను. మనమే ఉంచుకొనెదము. అతడు 25 రూపాయలిచ్చినచో తిరిగి యిచ్చెదము అనెను. వామనరావు తన వద్ద అంతపైకములేక కొందరి దగ్గర అప్పుగా వసూలుచేసి 25 రూపాయలు బాబాకు యిచ్చెను. మరల బాబా యిట్లనెను. నిజానికి ఈ నాణెము విలువ 25 రూపాయలకంటే చాలా విలువైనది. శ్యామా! ఈ రూపాయిని మనవద్దే వుంచుము. నీ పూజా మందిరములో పెట్టి పూజింపుమనెను. బాబా ఎందుకిట్లు ప్రవర్తించెనో అడుగుటకు ఎవరికీ ధైర్యము చాలలేదు. నిజానికి వామనరావు మేలునకే యిట్లుచేసి యుండవచ్చును.

రామచంద్రపాటిల్

తాత్యాకోటే పాటిల్‌కు బంధువు స్నేహితుడు అయిన రామచంద్రపాటిల్ అనునతడు కూడ బాబా మహిమలను తెలుసుకుని భక్తి శ్రద్ధలతో ప్రతిరోజు బాబాను పూజించెడివాడు. తాత్యావలనే అతనికి బాబాయందు ప్రేమ హెచ్చెను. లెండీబాగ్‌లో బాబా గడుపు సమయంలోను, చావడి ఉత్సవము ఏర్పాట్లలోను తాత్యాతో పాటు

యితడు కూడ కలిసి పనిచేసెడివాడు. 1916 డిసెంబరు చివరలో యితడు చాలా జబ్బుపడెను. ఎన్ని రకముల మందులు వాడినను ఫలితము కనిపించలేదు. ఆహార పానీయములు కూడ సరిగా తీసుకోలేని స్థితిలో ఉండి బాగా నీరసించి పోయి మంచముపట్టి ఉండెను. అతనికి నిరాశ కలిగెను. మరణము తప్పదని నిశ్చయించుకొని ఆశలు వదులుకొనెను. ఒకరోజు రాత్రి బాబాను తలచుకొని యిన్నిరోజులుగా నీ సేవచేయుచుంటిని అందుకు ఫలితముగా యికనైనా ఈ మంచములో పడి యుండుబాధను తొలగించి వెంటనే మరణమును ప్రసాదించమని బాబాను మనస్ఫూర్తిగా ప్రార్థించెను. ఆ రోజు నడిరాత్రి సమయమున బాబా అతని మంచము ప్రక్కన నిలబడి దర్శనమిచ్చెను. రామచంద్రపాటిల్ కన్నీరుకారుస్తూ, నేను ఈ విధముగా జబ్బుతో బాధపడుతూ మంచముపై పడియుండలేను. నేను త్వరగా మరణించునట్లు సహాయపడుమని విలపించెను, ప్రేమావతారుడైన సాయి అతనితో, నీవు భయపడవద్దు. నీ చావు చీటీ తీసి వేసితిని. త్వరలోనే ఆరోగ్యమును పొందెదవు. కాని నేను తాత్యాను గురించి ఆలోచించుచున్నాను. అతడు 1918 విజయదశమి నాడు మరణించును. ఈ విషయము ఎవరికీ తెలియనీయకుము. తాత్యాకు కూడ తెలియనీయకుము. తెలిసినచో అతడు మరింత భయపడునని చెప్పెను.

బాబా వాక్కు తిరుగులేనిదని, తప్పక జరిగి తీరునని రామచంద్ర పాటిల్‌కు తెలుసును. త్వరలోనే అతడు ఆరోగ్యవంతుడయ్యెను. కాని తాత్యాను గురించి అహర్నిశలు బాధపడుచుండెను. తనలోని బాధను దాచుకోలేక బాలాషింపికి మాత్రము చెప్పెను. వారిద్దరికీ తాత్యా స్నేహితుడగుటచే యిద్దరు తాత్యా జీవితము ముగియుచున్నదని బాధపడసాగిరి.

కాలచక్రము గిర్రున తిరిగుచుండెను. తరతరాల నుంచి యుగయుగాల నుంచి వస్తున్న రాత్రింపగళ్ళ చెలిమి అన్యోన్యంగా చెక్కుచెదరక చకచకా సాగుచుండెను. ఎవరి సుఖ దుఖములతోను, కష్టసుఖములతోను మాకుసంబంధము లేదన్నట్లు సూర్యచంద్రులు నడచుచుండిరి. 1916వ సంవత్సరము ముగిసెను. 1917 వచ్చెను. ఎంతో ధనము ఖర్చుపెట్టి నిర్మించిన మందిరములో శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్ఠించుటకు బూటీ తహ తహ లాడుచుండెను. ఎన్నిసార్లు ప్రార్థించినను బాబా ఓర్పువహించుమని మాత్రమే చెప్పుచుండెనుగాని విగ్రమును ఖరీదు చేయుటకు కూడ అనుమతినీయలేదు. బాబావద్దకు వచ్చు భక్తుల సంఖ్య నానాటికి పెరుగుచుండెను. సాయి యొక్క మహిమలు, లీలలు దేశపు నలుమూలలకు వ్యాపించుచుండెను.

హేమాద్రిపంతు యింటిలో బాబా హోళీ భోజనము

1917 హోళీపండుగ నాటి వేకువజామున బాంద్రాలోని హేమాద్రి పంతునకు కలలో బాబా కనిపించి ఆ రోజు వారి యింటికి భోజనమునకు వచ్చెదనని చెప్పెను. అదే విషయమును ఆయన తన భార్యతో చెప్పి, వారిద్దరూ చర్చించి, మీదట ఒక మనిషికి సరిపడు భోజన పదార్థమును ఎక్కువగా తయారుచేసిరి. హోళీ రంగవళ్ళుల పండుగ పూర్తి అయినది. మధ్యాన్న భోజనముకు ఏర్పాట్లు సిద్ధమైనవి. బాబా కొరకు ప్రత్యేక స్థలములో ఒక పీటను వుంచిరి. కుటుంబములోని వారందరూ భోజనమునకు కూర్చునిరి. దేవతార్పాణ పూర్తి అయి నెయ్యి కూడ వడ్డించిన తరువాత అందరూ భోజనమును తాకు సమయములో ఎవరో వచ్చి తలుపు కొట్టిరి. హేమాద్రిపంతు వెళ్ళి తెరచెను. వచ్చిన యిద్దరు వ్యక్తులు తమ చేతిలో గల షిరిడి సాయిబాబా పటమును ఆయనకిచ్చి మీ వస్తువు, జాగ్రత్తగా భద్రపరచుము అని, భోజనము వద్ద నుండి లేచి వచ్చినట్లున్నది, త్వరగా వెళ్ళి భోజనమును చేయుచు మిగిలిన విషయములు తరువాత మట్లాడుకొనెదమని చెప్పి వెళ్ళిపోయిరి.

భోజన సమయమునకు పటము రూపములో వచ్చిన బాబాను చూచి హేమాద్రిపంతు ఆశ్చర్యపడెను. ఆనందముతో కన్నుల నీరు కారినది. రోమములు నిక్కపొడుచుకున్నవి. బాబా కలలో చెప్పిన విషయము ఈ ప్రకారముగా నిజమైనందుకు సంతోషపడెను. వెంటనే ఆ పటమును తీసుకువచ్చి బాబా కోసం వుంచిన పీటపై పెట్టి వండిన పదార్థములన్నీ వడ్డించి బాబాకు నివేదన చేసిన తరువాత మాత్రమే మిగిలిన వారంతా భుజించిరి. అదే టైములో షిరిడిలో బాబా శ్యామాతో తానారోజు తృప్తిగా బాంద్రాలోని హేమాద్రిపంతు యింటిలో భోజనము చేసి తినని చెప్పెను. కొన్నాళ్ళకు పంతు షిరిడి వెళ్ళినప్పుడుగాని విషయము శ్యామాకు అర్థం కాలేదు. ఆ పటము ఎట్లు అక్కడికి చేరెనో తెలుసుకొనెదము.

అబ్దుల్ రహమాన్ అను యోగి ద్వారా చాలా కాలము క్రిందట బాబా యొక్క చక్కని నిలువెత్తు పటమును ఫ్రేము కట్టించబడి అలీమహమ్మద్‌కు యివ్వబడెను. కొన్నాళ్ళ తరువాత అతని బావగారికి జబ్బుచేసేను. యోగుల పటములను సముద్రములోవేసిన అతని వ్యాధి తగ్గునని ఎవరో చెప్పుటచే అతని మేనేజరును పిలిచి ఇంటిలోను బంధువుల యిళ్ళలోను వున్న పటములన్నిటినీ సముద్రములో వేయించెను. కొన్నాళ్ళ తరువాత అలీమహమ్మద్ యింటికి తిరిగి

రాగా బాబా పటము మామూలుగానే గోడకు వ్రేలాడుచుండుట చూసి ఆశ్చర్యపడెను. దానిని ఎవరికివ్వవలెనని ఆలోచించి బాబా యిచ్చిన ఆలోచనా ఆదేశం ప్రకారం హేమాద్రిపంతునకు అందించబడినది.

లాలా లక్ష్మీచంద్

ఇతడు మొట్టమొదట 1910లో దాసుగణు హరికథల ద్వారా బాబాను గురించి వినెను. ఆ తరువాత ఒకనాటి స్వప్నములో బాబాను చూచెను తన మనస్సులో షిరిడికి వెళ్ళవలెనని బాబాను చూడవలెనని ఉవ్విళ్ళూరుచుండెను. యిట్టి సమయములో అతని స్నేహితుడు శంకరరావు అతని వద్దకు వచ్చి తాను షిరిడి వెళ్ళుచుంటినని, తనతోపాటుగా అతనిని కూడ రమ్మని చెప్పెను. అతడు చాలా సంతోషించి 16 రూపాయలను అప్పుచేసి ప్రయాణం ఏర్పాట్లు చేసుకొనెను. రైలులో స్నేహితులిద్దరూ భజన చేసిరి. బాబా యొక్క లీలలను గురించి ఇతర ప్రయాణీకులను అడిగిరి. బాబాకు జామపండ్లను కొని తీసుకువెళ్ళవలెనని అనుకొనెను. మనోభీష్టమునకు తగినట్లుగా ఒక ముసలమ్మ జామపండ్ల గంపనెత్తిన పెట్టుకొని దగ్గరకు వచ్చెను. కొన్ని పండ్లను అతడు కొనెను. మిగిలిన వాటిని కూడ తన తరపున బాబాకు సమర్పించమని ఆమె అతనికి ఇచ్చెను. మసీదులోని బాబాను చూచి పాదనమస్కారము చేసెను. వారి పాదములను తాకగానే అతనికి మనస్సు కరిగెను. బాబా వెంటనే యిట్లనెను. టక్కరివాడు. దారిలో భజనచేసెను. ఇతరులనడిగిన ప్రయోజనమేమి? హృదయంలో గలకోరిక ఇప్పుడైనా నెరవేరినదా? 16 రూపాయలు అప్పు చేసి మరీ దర్శనమునకు రావలసిన అవసరమేమి? బాబా పలికిన ఈ విషయములన్నీ తన గురించేనని తెలుసుకున్న లక్ష్మీచంద్ బాబా సర్వజ్ఞత్వమును తెలుసుకుని ఆశ్చర్యపడెను. ఇతనికి సాంజా అనిన యిష్టము. ఒకరోజు ఎవరూ సాంజాతేలేదు, కాని బాబా బాపుసాహెబ్ జోగ్‌ను ఆదేశించి రెండు కుండల నిండ సాంజా చేయించి అతనితో "నీ కడుపు అకలితో ఖాళీగా యున్నది. కావలసినంత సాంజా తినుమనెను." బాబా తన యిష్టాన్ని కూడ గమనించి సాంజా చేయించుటచే వారికి తెలియని విషయమే లేదని నిర్ణయించుకుని ఆజన్మాంతము సాయిని త్రికరణ శుద్ధిగా నమ్మియుండెను.

శ్రీమతి మెహతా

బరహంపూరు నివాసి అయిన ఈమెకు ఒకసారి సాయి కలలో కనిపించి తాను తినుటకు కిచిడి కావలెనని అడిగెను. ఎట్లయినను కిచిడీని చేసి బాబాకు ప్రసాదముగా సమర్పించవలెనని ఎంతో కాలము ప్రయత్నించినను కుదరలేదు.

చివరకు 1917 ఏప్రిల్ నెలలో ఈమె తన భర్తతో షిరిడికి వెళ్ళెను. అక్కడ కూడ కిచిడీ నైవేద్యము చేసి పెట్టుటకు 15 రోజుల వరకు ఆమెకు సాధ్యపడలేదు. కాని ఒకనాడు గట్టి ప్రయత్నము చేసి కావలసిన వాటినన్నిటినీ సమకూర్చుకుని కిచిడీ ప్రసాదముతో 12 గంటలకు మసీదుకు చేరెను. మసీదులో తెరవేసియుండెను. తెరవేసి యున్నపుడు ఎవరునూ లోనికి ప్రవేశించరాదు. ఆమెకు ఆ నియమము తెలిసినప్పటికీ నిలువలేకపోయెను. ఎట్లయినను వెంటనే కిచిడీ ప్రసాదము బాబాకు అందించవలెనని తలచి తెర పైకెత్తి లోపలకు వెళ్ళి ప్రసాదమును బాబాకు ముందు వుంచెను. బాబా దానిని సంతోషముతో ముద్దపై ముద్ద చెక చెకా మ్రింగెను. దానిని చూచిన వారందరూ ఆశ్చర్యపడిరి. ఆమె కూడ ఆ దృశ్యమును చూచి పరవశించెను. ఎన్నో ఏళ్ళ క్రితం బాబా అడిగిన ప్రసాదం సమర్పించుటకామె ఎంత ఆతురతపడెనో అంతే అతురతతో ఆ ప్రసాదమును బాబా స్వీకరించెను. యద్భావం తద్భవతి అన్నట్లుగా బాబా యొక్క ప్రేమానురాగములు భక్తులపై ప్రసరించుచుండెడివి.

దైవఖజాన

బాబా ఏ జన్మమున జరిగిన కథో ఒకనాడు యిట్లు చెప్పెను - "నా చిన్నతనములో జీవనాధారమైనపని కొరకు బీడ్‌గాం వెళ్ళితిని. అక్కడ నాకు గుడ్డల అల్లికపని దొరికెను. తీవ్రమైన శ్రమపడి పనిచేసెడివాడను. యజమాని నా పనికి తృప్తిచెందెడివాడు. నా కంటె ముందు ముగ్గురు పని వాళ్ళుండిరి. మొదటివానికి 50 రూపాయలు, రెండవవానికి 100 రూపాయలు, మూడవవానికి 150 రూపాయలు యిచ్చెడివాడు. నాకు ఈ మూడు మొత్తములు కలిపిన దానికంటే రెండితలు. 600 రూపాయల జీతమిచ్చెను. నా యజమాని నన్ను ప్రేమించి ఆదరించి, మెచ్చుకొను చుండెడివాడు. నేను భౌతికముగా చేయు నా పనినే దైవారాధనా భావంతో చేసెడివాడను. అందువలన ప్రతిఫలంగా వచ్చు జీతమును కూడ దైవమిచ్చినట్లుగా భావించి జాగ్రత్తగా దాచుకొనెడివాడను. మానవుడిచ్చినది త్వరలో సమసిపోవును. దైవమిచ్చునది శాశ్వత ముగా వుండును. నా ప్రభువైన అల్లా తీసుకో తీసుకో అనుచున్నాడు. కాని భక్తులమని నా వద్దకు వచ్చు ప్రతివాడు యివ్వు యివ్వు అని అడుగుచున్నాడు. ఒకటి ఒకసారి యిచ్చిన చాలదు. ప్రతిక్షణం, ప్రతి విషయంలోను, తానే లాభము పొందవలెననెడి భక్తులు పెరిగిపోయినారు. నేనేమి చెప్పుచున్నానో గ్రహించువాడు ఒక్కడూలేడు. నాదైవం యొక్క ఖజానా నిండుగా వుండి పొంగిపొర్లుతున్నది. సుపుత్రుడైనవాడు ఈ ధనమును బండ్లతో త్రవ్వి తీసుకుపోవచ్చును. కాని దానికి ఎవరూ ఆశపడుటలేదు.

నా ఫకీరు చెతురత, నా దైవలీలలు అమోఘములు. ఈ నా శరీరము మట్టిలో కలియును, ఊపిరిగాలిలో కలియును, జీవమున్నంతవరకే ఈ అవకాశం. నేనెక్కడికో వెళ్ళి ఏదోపని చేయుచుండెదను. అయినను ఈ మాయ నన్ను బాధించుచున్నది. యిలాంటి కష్టతరమైన పరిస్థితులలో కూడ నన్ను నమ్మిన వారికొరకు నేను చాలా ఆతురపడెదను. నా భక్తుల విషయములో నేను నిత్యజాగరూకుడనై వుండెదను. ఎవరు ఎంత సాధన చేసిన వారికంత ఫలితమునిచ్చెదను. నా మాటలు విశ్వసించు వారలు, నన్ను మరువనివారు అంతులేని ఆనందమును పొందుదురు.

బాలాబువసుతార్

ఒకనాటి సాయంత్రము లెండిబాగ్‌కు వెళ్ళుచూ బాబామధ్యలో కొద్ది క్షములు బూటీ వాడా ఎదురుగా ఆగినిలబడెను. బొంబాయిలో వుండు యోగి బాలబువసుతార్ అప్పుడే షిరిడికి మొదటిసారిగా వచ్చి బాబాకు నమస్కరించెను. బాబా అతనికి అభయ అశీర్వాదము నిచ్చి నాలుగు సంవత్సరముల నుంచి యితనిని నేను ఎరుగుదును అని చెప్పిరి. అతనికి ఆశ్చర్యము వేసెను, బాగా ఆలోచించగా నాలుగు సంవత్సరముల క్రిందట బొంబాయిలో ఒకసారి బాబా ఫోటోకు నమస్కరించినట్లు జ్ఞాపకమునకు వచ్చి బాబా సర్వజ్ఞులు, సర్వాంతర్యాములని, వారి భక్తులు ఎవరెవరు ఎక్కడెక్కడ ఏమిచేయుచున్నా అన్నీ వారు తెలుసుకోగల సమర్థులని గ్రహించెను.

హరిభావుకర్ణిక్

యితడు 1917వ సంవత్సరం గురుపూర్ణిమనాడు షిరిడికి వచ్చి బాబాను పూజించి వస్త్రములు దక్షిణ సమర్పించి బాబావద్ద శెలవు పొంది మసీదు మెట్లు దిగగానే యింకొక రూపాయి బాబాకు దక్షిణ యివ్వవలెనని తలచెను. బాబావద్ద శెలవు తీసుకొనిన తరువాత వెనుకకు తిరుగరాదనే నియమం వుండుటచే ముందుకు సాగి యింటికి ప్రయాణమయ్యెను. దారిలో నాసిక్‌లోగల కాలారాముని మందిరమును దర్శించి బయటకు వచ్చుచుండగా తన శిష్యులతో మాట్లాడుచున్న నరసింగమహారాజ్ అను యోగి వారిని విడిచివచ్చి హరిభావు చేతిని గట్టిగా పట్టుకుని "నా రూపాయి నా కిమ్ము" అని బాకీదారుని అడిగినట్లు అడిగెను. అతడు ఆశ్చర్యానందములతో సాయిబాబా వారే వీరిద్వారా తాను యివ్వదలచిన రూపాయి తీసుకొనుచున్నారని గ్రహించి వెంటనే యిచ్చెను. యోగీశ్వరులందరూ ఒక్కటే, సర్వదేవతలూ ఒక్కటే.

నిజానికి యోగులకు దేవతలకు భేదమేలేదు. అందువలననే ఏదేముడికి మొక్కిన మొక్కునైనా బాబా తనకు రావలసిన బాకీగా తీసుకొనెడివాడు.

బాబావద్ద సెలవుపొంది-వెనుతిరిగి రాకూడదు.

1905 నుండి 1917 వరకు అనేక మంది భక్తులుదూరప్రాంతాల నుంచి వచ్చి బాబా వద్ద చాలాకాలం వుండిపోయి సాయి ప్రేమామృతంలో మునిగి తేలుతుండెడివారు. ఈర్ష్య, స్వార్థ, ద్వేష అహంకార మమకారములతో నిండిన రాక్షస ప్రపంచములో అనేక బాధలుపడి మానసికంగా అలసిపోయిన వారికి సాయి ప్రేమ చవిచూసిన తరువాత వారి నుంచి దూరంగా వెళ్ళుటకు మనస్కరించేదికాదు. కాని వారు నిర్వహించవలసిన భౌతిక బాధ్యతలు యింకా వున్నప్పుడు మాత్రం కొందరిని సాయి స్వయంగా తిరిగి యింటికి వెళ్ళమని ఆదేశించేవారు. ప్రేమ స్వరూపుడైన సాయి మాట కాదనలేక ప్రయాణమై కొద్ది దూరం ముందుకు నడచి వెళ్ళిన తరువాత సాయి ఎడబాటును సహించలేక ఏడుస్తూ సాయంత్రం వరకు షిరిడి గ్రామంలోపలే గడిపి తిరిగి రాత్రికి బాబా వద్దకు వచ్చేవారు. ఈ రాత్రిపూట బాబా తిరిగి వెళ్ళమనరుకదా? రేపటి విషయం రేపు చూసుకోవచ్చుననే భావన వారిలో ఉండేది. భక్తులలో పెరుగుతున్న ప్రేమ పూరితమైన ఈ దుర్బలత్వాన్ని గమనించిన బాబా ఒకసారి శెలవు పొంది వెళ్ళిన తరువాత మళ్ళీ వెనక్కు తిరిగి రాకూడదని ఖచ్చితమైన నిర్ణయమును చేసెను. ఒకవేళ అలా తిరిగి మళ్ళీ దగ్గరకు వచ్చినచో వారికి ప్రయాణములో కష్టములు కలుగునని కూడ వారు శాసించిరి. యిది భక్తులను క్రమశిక్షణా మార్గంలో పెట్టుటకు ఒక నియమంగాని, బాబా కోరి వారికి కష్టములనిచ్చు కఠిన శాసనముగా భావించరాదు.

బాబా సెలవు తీసుకుని వెనుదిరిగి రాకూడనట్లుగనే ఈ సాయి జీవిత చరిత్రలో తెలుసుకొనిన విషయములు, కథలు కూడ నిరంతరము గుర్తుచేసుకొనెద ముగాక. ప్రతిరోజు, ప్రతిక్షణం బాబాను మన మనోఫలకంపై చూడగలిగెదముగాక? ఈ మనోనిశ్చయం నుండి కూడ వెనుతిరగని విధంగా సాయి మనలనందరినీ కాపాడగలందులకు ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః
యిరువది తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

ముప్పదవ అధ్యాయము

అది 1917వ సంవత్సరము చీమల పుట్టలవలె భక్తులు షిరిడికి వచ్చుచుండిరి. ఎంతో మందిని బాబా పిచ్చుక కాలికి దారంకట్టి లాగినటుల షిరిడికి లాగుచుండెను. అలాంటివారిలో యింకొకరు.

అప్పాసాహెబ్ కులకర్ణి

ఒకరోజు సాయిబాబా పోలికలున్న ఒకఫకీరు మధ్యాన్నము 12 గంటలకు వారి యింటికి వచ్చెను. అప్పుడు కులకర్ణి యింటివద్దలేడు. వీరి భార్యపిల్లలు ఆ ఫకీరును మీరు షిరిడి సాయిబాబాగారా అని అడిగిరి. అందుకా ఫకీరు నేను భగవంతుని సేవకుడను. వారి ఆజ్ఞ ప్రకామే మీ యోగ క్షేములు తెలుసుకొనుటకు వచ్చితిననుచు దక్షిణ అడిగెను. ఆమె ఒక రూపాయి యిచ్చెను. ఆ ఫకీరు ఒక చిన్న పొట్లములో విభూది యిచ్చి పూజలో వుంచుకుని పూజించుమని చెప్పెను. ఆ సాయంత్రము కులకర్ణి యింటికి తిరిగివచ్చి ఫకీరు దర్శనము తనకు లభించకపో యినందుకు బాధపడెను. తాను యింటిదగ్గర వుండినచో 10 రూపాయలు దక్షిణ యిచ్చి యుండెడివాడనని చెప్పెను. ఆకలిగానున్నను వెంటనే ఫకీరును వెదకుటకు బయలుదేరెను. ఎన్ని చోట్ల వెతికినా కనిపించకపోగా తిరిగి యింటికివచ్చి భోజనముచేసి మరల ఒక స్నేహితునితో విహారమునకు పోయి ఫకీరు ఎక్కడైనా కనిపించునేమోనని వెతకుచుండెను. ఉన్నట్టుండి వెనుకగా ఆ ఫకీరువచ్చి చేయి చాచి దక్షిణ అడుగగా ఒక రూపాయి యిచ్చెను. యింకను అడుగగా మరియొక రూపాయి యిచ్చెను. మరల అడుగగా స్నేహితుని వద్ద నుంచి మూడు రూపాయలు తీసుకుని యిచ్చెను. ఫకీరు అసంతృప్తిగా వుండటచే తమ యింటికి రమ్మని వెంట తీసుకుని వెళ్ళి నాలుగు రూపాయల నిచ్చెను. యింకా దక్షిణ అడుగగా 10 రూపాయల నోటునిచ్చెను. ఫకీరు 9 రూపాయలను తిరిగి యిచ్చి వెళ్ళిపోయెను. అతడు 10 రూపాయల నిచ్చెదనని అనుటచే అదే మొత్తము ముట్టువరకు తృప్తి పడలేదు. తనచేతితో 9 రూపాయలను పవిత్రపరచి ఫకీరు యివ్వగా వాటిని కులకర్ణి పూజలో వుంచుకొనెను.

ఒకసారి కులకర్ణి షిరిడి వెళ్ళినప్పుడు. బాబా యొక్క తలవెంట్రుక అతనికి దొరికెను. దానిని తాయెత్తులో పెట్టించి చేతికి కట్టుకొనెను. ఈ రెండు సంఘటనలు జరిగిన తరువాత అతనికి ధనము విపరీతముగా దొరికినది. ఆధ్యాత్మికముగా కూడ చాలా ముందంజవేసెను.

సాయి దేవునికి భౌతికంగాకూడ ఎముకలేని చెయ్యని, వారి దగ్గరకు వెళ్ళిన వారి నెవరినీ ఒట్టి చేతులతో తిప్పి పంపరనే పేరు పడిపోయినది. అందువలన పాటలు, భజనలు పాడువారు, గారడి విద్యలు ప్రదర్శించువారు, జ్యోతిష్కులు మొదలైనవారంతా సాయి వద్దకు వచ్చి తమ విద్యలను ప్రదర్శించి బహుమతులను పొంది తిరిగిపోవు చుండెడివారు. కొందరు సన్నిహితులైన భక్తులు కుటుంబ సమేతంగా షిరిడిబాబా దర్శనానికై వచ్చినప్పుడు బాబా వారందరికీ బట్టలు కూడ పెట్టుచుం డెడివారు. దక్షిణ అడిగిన డబ్బు తీసుకొనుటతప్ప మిగిలిన యే యితర ధన సంబంధమైన విషయములలోను ఎలాంటి వారితోను బాబా లావాదేవీలు పెట్టుకునే వారు కాదు. కొందరు అప్పుడప్పుడు అలాంటి విషయములను ప్రస్తావించినప్పుడు ధన విషయములలో తాను యిరుక్కొనదలచలేదని నిర్మోహమాటంగా చెప్పేవారు.

ధనమునందు వారికి ఏ విధమైన ఆసక్తిలేనట్లుగానే స్త్రీ విషయములో కూడ ఎలాంటి ఆశలు, ఆకర్షణలకు లొంగనివారు బాబా, వారు అస్ఖలిత బ్రహ్మచారులు.

సాయి పాములవలె కన్పించుట

షిరిడి నివాసి రఘుపాటిల్ ప్రతిరోజు ఉదయమే వచ్చి బాబాకు నమస్కరించిన గాని ఏ పని ప్రారంభించెడివాడు కాదు. ఒకసారి తన బావమరిది 'నెవాస' గ్రామవాసి ఐన బాలాజీ పాటిల్ యింటికి వెళ్ళవలసి వచ్చి గుర్రముపై శ్రీరాంపూర్ వరకు వెళ్ళి అక్కడి నుంచి టాంగాపై నెవాసాకు వెళ్ళెను. రెండవ రోజు ఉదయమే లేచి బాబా ప్రతిరోజు షిరిడిలో నీ దర్శనము చేసుకొనెడివాడను, ఈనాడు నీదర్శన భాగ్యం నాకు లేదాయని కళ్ళు మూసుకుని బాబాను తలచుకొనెను. నేను దర్శమిచ్చిన నీవు భయపడవద్దు. అని బాబా మాటలు వినిపించెను. యింతలో పశువుల కొట్టములో పనిచేయుచున్న పనివాడు పాముపామని అరచెను. అందరూ పరుగెత్తిరి. రఘుపాటిల్‌కు సాయే పాముగా వచ్చినట్లుగా భావన కలిగి చిన్న గిన్నెలో పాలను పోసి పాము ముందు పెట్టగా అది పాలను త్రాగెను. మిగిలిన వారంతా

భయపడి పారిపోయిరి. అతడు చూచుచుండగానే పాము కొంచెము దూరము ప్రాకి మాయమయ్యెను, ఈ విధముగా పాము రూపములో బాబా తనకు దర్శనమిచ్చి పాలు త్రాగి వెళ్ళినందుకుగాను రఘుపాటిల్ చాలా సంతోషపడెను.

బాబాకు భోజనము పెట్టుట

బాబాను అత్యంత భక్తి శ్రద్ధలతో సేవించిన స్త్రీ భక్తులలో బయజాబాయి, రాధాకృష్ణ మాయిల తరువాత స్థానం లక్ష్మీబాయి షిండేకు దక్కుతుంది. రాధాకృష్ణ మాయి మరణానంతరము ఈమె బాబాకు కావలసిన ప్రతి చిన్న విషయమును చాలా భక్తి శ్రద్ధలతో తానే స్వయముగా చేయుచుండెడిది. ఒక తండ్రికి కూతురువలె సేవచేయుచుండెను. అప్పటిలో గ్రామములో గలవారిలో ఈమె ధనవంతురాలు, సుగుణవతి. రాత్రింపగళ్ళు బాబాను కనిపెట్టుకుని యుండి సేవచేయుచుండెడిది. రాత్రి సమయంలో భక్త మహల్సాపతికీ, తాత్యాకు లక్ష్మీబాయికు తప్ప యితరులెవ్వరికీ మసీదులో ప్రవేశించుటకు అజ్ఞలేదనిన ఈమె యొక్క సేవాపరాయణతను మనం గ్రహించవచ్చును.

1917లో ఒకరోజు సాయంత్రము మసీదులో కూర్చుని బాబా తాత్యాతో మాట్లాడుచుండగా లక్ష్మీబాయి వచ్చి బాబాకు నమస్కరించెను. ఆమెతో బాబా లక్ష్మీ నాకు చాలా ఆకలిగావున్నదని చెప్పెను. ఆమె వెంటనే రొట్టె తెచ్చెదనని చెప్పి యింటికి తిరిగి వెళ్ళి త్వరగా రొట్టె కూర తీసుకువచ్చెను. బాబాదానిని అందుకుని ఎదురుగా వున్న కుక్కకు వేసెను. ఆ కుక్క తోకాడించుచు ఆ రొట్టెను పూర్తిగా తిని ఆనందించెను. అప్పుడు లక్ష్మీబాయి బాబాతో నేను స్వయముగా వెళ్ళి నా చేతులతో నీ కొరకు రొట్టె తయారు చేసుకుని రాగా నీవు దానిని కుక్కకు వేసితివి. కుక్కకు రొట్టె వేయుట కొరకు నన్నింత శ్రమపెట్టితవేమి? అని ప్రశ్నించెను. అందుకు బాబా-నీవు విచారించవలదు. కుక్క ఆకలి తీర్చుట నా ఆకలి తీర్చుటతో సమానమే. జంతువులకు కూడ ఆత్మకలదు. ప్రాణులు వేరుకావచ్చు కాని అందరి ఆకలి ఒక్కటే మానవులు మాట్లాడగలరు, జంతువులు మాట్లాడలేవు. ఎవరు ఆకలితోనున్న వారికీ ఆహారము పెట్టెదరో వారు నాకు తృప్తిగా భోజనము పెట్టినట్లగును. దీనిని గొప్ప సత్యముగా తెలుసుకొనుము. సాయి బోధించిన ఈ నీతి విషయమును బట్టి సాయి సర్వజీవులయందు కలడని, సర్వవ్యాపియని, చావు పుట్టుకలులేని అమరులని మనము గ్రహించవలెను. ఈ విషయములో బాబా స్వయంగా పలికిన మాటలను మరి యొక్కసారి గుర్తు చేసుకొనెదము. నన్ను

వెదకుటకు నీవు దూరముగా ఎక్కడికో పోనక్కరలేదు. నీ నామమును, నీ శరీర ఆకారమును వదిలినచో నీలోనే కాక అన్ని జీవులలో చైతన్యము, లేక అంతరాత్మ అని ఒకటీ యుండును. ఆ అంతరాత్మనే నేను. ఈ విషయమును మీరు శ్రద్ధగా గ్రహించగలిగినచో సర్వ వ్యాపకత్వమనుభవించి నా నిజరూపాన్ని గుర్తించగలిగి, నాలో ఐక్యము పొందగలిగెదరు.

బాపు సాహెబ్ జోగ్ సన్యాసము

జోగ్ 1909లో ఉద్యోగ విరమణ చేసిన తరువాత భార్యతో కలిసి షిరిడికి వచ్చి స్థిర నివాసముండెను. వీరికి సంతానము లేకపోవుటచే సంసార జంఝాటము లేదు. భార్యా భర్తలిద్దరూ బాబాను ప్రేమించి వారి సేవలో నిమగ్నమైనారు. మేఘశ్యాముడు మరణించిన తరువాత మసీదులోను, చావడిలోను బాబాకు పూజ ఆరతులు యిచ్చుచుండెడివాడు. బాబా సమాధి చెందువరకు ఈ పనులను వీరే చేయుచుండెడివాడు. ఈయనకు పూజారిజోగ్ అని కూడ పేరు వుండెడిది. సాయంత్రపు వేళలో జ్ఞానేశ్వరి ఏకనాధ భాగవతము మొదలైన పవిత్ర గ్రంధములను చదివి శ్రోతలకు బోధించుచుండెడివాడు. ఎన్ని చేసినను అతని మనసుకు శాంతి లభించలేదు. ఒకనాడు బాబాతో 'నేనిన్నాళ్ళు నీ సేవచేయుచుంటిని ఐనను నా మనసు శాంతించలేదు. ఎందువలన? నన్నెప్పుడు కరుణింతువని అడిగెను. అందుకు బాబాకొద్ది కాలమాగుము, నీ చెడ్డ కర్మల ఫలితము నశించును, నీ పాపపుణ్యములు భస్మమగును. నీవు ఎప్పుడు అభిమానమును, మోహమును, రుచిని జయించెదవో, వాటంతట అవిగా వచ్చు ఆటంకములను దాట గలిగెదవో అప్పుడు నీజన్మ ధన్యమగును అని చెప్పిరి. కొంతకాలమునకు అతని భార్య చనిపోయెను. అతనికి యింకొక అభిమానములేక స్వేచ్ఛాపరుడై సన్యాసమును తీసుకుని ధన్యుడయ్యెను. ఈ కథలోని బాబా యొక్క సందేశమును మనం జాగ్రత్తగా గమనించవలెను. ఈర్ష్య, స్వార్ధ, ద్వేషాది బలమైన విషయములను జయించిన తరువాత, అభిమానము, మోహము రుచి లాంటి చిన్నసైజు శత్రువులకు మనం లొంగకతప్పదు. వీటని కూడ జయించిన గాని సంపూర్ణ శాంతి లభించదు. లేనిచో వాటి కొరకు మనసు మరల ఆతురత చెంది అవి లభించనిచో ఆవేదన పొంది శాంతిని దూరం చేయును. యిది కేవలం ఒకస్థితికి వచ్చిన భక్తులకు మాత్రమే అర్ధమగును. యిలాంటి సాధనా మార్గములను శిష్యులకు సద్గురవు ఎవరి స్థితిని బట్టి వారికి బోధించి ముందుకు నడుపుచుండును. శిష్యుల హోదాలను, ధనాన్ని ఆసరాగా తీసుకుని జీవితాన్ని గడిపే బాధ గురువులకు శిష్యుని స్థితి ఏమిటో అర్ధంకాదు. ఒకవేళ కొంచెం అర్ధమైనా యిలాంటి విషయాలు చెపితే

ఎక్కడ తమ చేయిజారిపోతారో అనే భయంతో అసలు విషయాన్ని వారికి బోధించరు. అసంఖ్యాకంగా వున్న ఈనాటి గురువులకు శ్రీ షిరిడి సాయిబాబాకు వున్నతేడా యిదే!

బాలగంగాధరతిలక్ షిరిడివచ్చుట

ఖపర్డే అంతకు ముందుగనే షిరిడికి వచ్చి బాబాయొక్క మహిమలు, శక్తి సామర్ధ్యములను స్వయముగా గ్రహించియుండుటచే ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ కాంగ్రెసులోని అతివాద వర్గ నాయకుడు అయిన బాలగంగాధర తిలక్‌ను ఖపర్డే వెంట బెట్టుకుని 1917 మే నెల 19వ తేదీన షిరిడికి వచ్చి బాబా దర్శనము చేయించి స్వాతంత్ర్యవుద్యమం గురించిన కొన్ని సూచనలను, సలహాలను బాబా నుండి కోరెను. వారికి బాబా తగు సూచనలను గుప్తముగనే యిచ్చినట్లుగా ఆధారములు కనిపించుచున్నవి. ఆనాటి బ్రిటిష ప్రభుత్వ పరిపాలన లోగల దేశకాలపరిస్థితుల దృష్ట్యా ఈ విషయమును గుప్తముగా వుంచబడెను. తిలక్ మహాశయుడు షిరిడికి వచ్చి వెళ్ళిన తరువాత అప్పటి అహమద్‌నగర్ జిల్లా కలెక్టరు బాబా చర్యలను గమనించి రహస్య నివేదిక సమర్పించవలసినదిగా గూఢచారిని షిరిడికి పంపెను.

భారతదేశమునకు స్వాతంత్ర్యము తప్పక వచ్చునని, అది అతివాద హింసాయుత విధానములవల్ల కాక శాంతి ప్రేమమార్గముల ద్వారా మాత్రమే సిద్ధించగలదని తిలక్‌కు బాబా బోధించినట్లుగను, తిలక్‌ను కూడ తన అతివాద చర్యలను విరమించవలసినదిగా సలహా యిచ్చినట్లుగను, ఆనాటి నుంచి తిలక్ యొక్క అతివాద ప్రభావం చాలావరకు తగ్గినట్లుగా ఆధారాలు దొరకుతున్నవి.

హిందూముస్లిం ఐక్యత

ఆనాడు మన భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలనేది ముఖ్య సమస్యగా రూపుదాల్చుకొనుచున్నది. యిది రాజకీయ సమస్య, సాంఘికముగా ముఖ్యమైన సమస్య హిందూ ముస్లిం మత విభేదాలు. బ్రిటిష ప్రభుత్వం తరచు జరిగే యిలాంటి విభేదాలను తొలగించుటకు లక్ష్యశుద్ధితో పనిచేయలేదు. పైగా చేత నైనంత వరకు ఈ మత తగాదాలను ప్రోత్సహిస్తూ వుండేవారు కూడ. మత విభేదాలు పెరిగితే స్వాతంత్ర్య పోరాటం వైపునుంచి ప్రజల దృష్టిని మరల్చవచ్చుననే ఆలోచన ఆనాటి

ప్రభుత్వానిది. ఆరోజులలో ముస్లిములు విస్తారంగా వ్యాపించియున్న ఔరంగాబాదు పరిసర ప్రాంతాలలో మత విభేదాల వల్ల తరచుగా సామాన్యుడి జీవితం చెల్లాచెదురౌతూ వుండేది. అశాంతి, తగాదాలు. ఆస్తినష్టం, ప్రాణ నష్టాలుండేవి అందువలన పూజా పునస్కారాల కన్నా మత సామరస్యం మనిషికి శాంతి నివ్వగలదని బాబా గ్రహించారు. పంతాలు, పట్టింపులు, ఆధిక్యతలు తప్ప రెండు మతాలలోని మతాధికారులలోను సమభావన, సహకారం ప్రేమ భావాలు నశించాయనే సత్యం సాయికి బాగా తెలుసు. అటు రాజకీయంగాను, యిటు మతపరంగాను కూడ సామాన్య మానవునికి శాంతి నందించగలిగినవారు లేరు ఆనాడు. అందుకే సాయి హిందు ముస్లిం ఐక్యతకు అంకితమై "సబ్‌కామాలిక్ ఏక్ హై" అన్న సూక్తిని పదే పదే గుర్తుచేసెడివాడు. రెండు మతాలలోని సత్యము ఒక్కటే, సారాంశము ఒకటే. కాని వచ్చిన సమస్య మతాధికారులు, మూఢ ఆచార వంతులతోనే. ఆనాడు బాబా ప్రారంభించిన హిందూ ముస్లిం ఐక్యతే దేశ రాజకీయాలకు అవసరమని గ్రహించిన మహాత్మాగాంధీ హిందూ ముస్లిం భాయి భాయి అన్న నినాదాన్ని యిచ్చాడు. ఎంతో ముందు చూపుతో సాయి దేశ సమైక్యతను, శాంతి, పరస్పర ప్రేమను దృష్టిలో పెట్టుకుని ఈ సమాజ కళ్యాణ కారణాన్ని తనదైన విశిష్ట ఆధ్యాత్మిక మార్గంలో మేళవించి కలిపారు. మతాలనన్నిటినీ సమన్వయపరచటం సాయి తత్వ సారాంశం. అందుకే తన నివాసం మసీదు. అందులో హిందువులకు పవిత్రమైన అగ్నిహోత్రం. ముందుగా తులసికోట. ఆరతి చివరకు సాయి మహారాజ్‌కు వినిపించేటట్లుగా వేసే కేకలు ముస్లింల నమాజును పోలియుండునట్లు సాయినాధుడే నిర్ణయించాడు. ఈ విధంగా దైనందిన ఆధ్యాత్మిక జీవితంలో హిందూ ముస్లిం మతాలను ఏకంచేసి రెండుమతాల వారిని ఒక్క తాటిపై నిలపాలని తీవ్రకృషి సల్పారు శ్రీ షిరిడి సాయిబాబా.

బాబాయొక్క ఈ మతసామరస్యాన్ని గురించిన అవగాహన ఏర్పరచుకునే ముందు మనం మతమనగా ఏమిటో, అవి ఎట్లు ఏర్పడినవో తెలుసుకొను ప్రయత్నం చేద్దాము. మతం అనేది వివిధ ప్రాంతాలలోగల మానవుల యొక్క జీవన పద్ధతులను సమాజపరంగా నిర్ణయించిన సిద్ధాంతం మాత్రమే. జంతు జీవనం నుండి మానవుడు సహజీవనాన్ని, సంఘ జీవనాన్ని అలాటు చేసుకున్నాడు. ఈ విధంగా ఒకేచోట అందరూ కలిసి నివసించుట నేర్చుకున్న తరువాత ఒకరి ప్రవర్తన యింకొకరికి బాధ కలిగించేదిగా వుండటం సహజంగా జరుగుతూ వుంటుంది. వాతావరణము

అందుబాటులో నున్న వనరులనుబట్టి జీవన పద్ధతిని నిర్ణయించారు కొందరు తెలివైన అనుభవజ్ఞులు. ఈ విధంగా వచ్చిన అనేక అనుభవములను దృష్టిలో వుంచుకొని ప్రతి దేశములోని వారు వారి వారి ప్రాంతాలకు అనుగుణంగా మనిషిప్రవర్తనను గురించి కొన్ని సూచనలు చేశారు. ప్రతి మనిషి తన కొరకు ఆచరించవలసిన నియములు కొన్ని, తన ప్రవర్తనవలన యితరులకు బాధ కలుగకుండా మేలు కలుగునట్లు వుండు నియమములు కొన్ని. ఈ విధముగా ప్రతిచోట ఆ ప్రాంతాల కనుగుణంగా వ్యక్తిగత సాంఘిక నియమాలు కట్టుబాట్లతో కూడిన ఆచార వ్యవహారాలే మతాలుగా రూపొందినాయి. కాబట్టి మతమనగా క్రమబద్ధం చేయబడిన ఆచార వ్యవహారాలతో కూడిన సాంఘిక కట్టుబాట్లు మాత్రమే. దీనికిమూలం మనుషులందరూ సుఖసంతోషాలతో వుండాలనేదే? అలాంటి మతాలు రాను రాను విద్వేషాలను పెంచుకుని మారణహోమం సాగిస్తున్నాయి. రక్తపాతం చిందిస్తున్నాయి. యిందుకు కారణం మతాలు, మత సిద్ధాంతాలు కాదు. వాటిని అంటిపెట్టుకుని వున్న మనుషులే. ఒక తల్లికి పుట్టిన అన్నదమ్ములే ఒకరినొకరు చంపుకొని మరణించుట రెండు మేకల కథలో చూశాము. యిక్కడ ఒకేమతం, ఒకే రక్తం కూడ మారణహోమాన్ని ఆపలేకపోయిందిగదా. కాబట్టి మతమనే దాంట్లో ఏ చెడు లేదని, చెడు ఏదైనా వుంటే అది మనుషులలోనేనని గుర్తించాలి. పరమత ద్వేషాన్ని చంపుకోవాలి, సర్వమత, సర్వమానవ సమానత్వాన్ని హృదయంలో నింపుకోవాలి. యిదే సాయి యొక్క మత సామరస్య సిద్ధాంతం. యిక ఈనాటి మన భారతదేశ విషయం చూస్తే పేరుకు హిందూదేశమే అయినా, ముస్లింలు క్రైస్తవులు, సిక్కులు జైనులు మొదలుగా గల అనేక మతముల వారు నివశిస్తున్నారు. అప్పుడప్పుడు మత విషయంపై మారణహోమం రక్తపాతం జరుగుతూనే వుంటున్నది. యిందుకు కారణం మతాలు మాత్రం కాదు. మతాధికారులేనని మనం గుర్తుంచుకోవాలి. యిన్ని మతాలు కలిసి వుండటంచేతనే మనదేశంలో కులాతీత మతాతీత రాజ్యాంగ వ్యవస్థను ఏర్పరచినారు.

యిన్ని మతాలు వుంటే మతాలమధ్య విభేదాలు ఎప్పటికైనా తప్పవని, ఒకదేశంలో ఒకే మతం వుంటే బాగుంటుందని కొందరు మేధావులు అభిప్రాయపడుతున్నారు. యిది కూడ కొంత వరకు మంచి ఆలోచనే కాని అందుకు ఆచరించే మార్గాలేవి అనేది ముఖ్యం. ఒకే మతాన్ని దేశంలో నిర్మించుట కోసం మిగిలిన మతాలపై ద్వేషంతో రక్తపాతాన్ని సృష్టించి భయపెట్టి బలవంతంగా మత మార్పిడి చేయించటమా? దీనిని ఏ మతమూ ఒప్పుకోదు. ఏ దేముడు ఒప్పుకోదు. సాయి చూపిన ప్రేమ మార్గంలో ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఒక సూచనా మార్గాన్ని బాబామార్గంగా తీసుకోవచ్చును. వివాహ సంబంధాలు చేయునప్పుడు ఒకమతం

యువకునికి యింకో మతం యువతితో వివాహం చేసి ఈ విధంగా అన్ని మతాలను కలగాపులగం చేసిన మత విభేదాలను అందరూ మరచిపోయేటట్లుగా చేసి సర్వమత సామరస్యాన్ని బోధించిన సాయి మతాన్ని స్థాపించి అన్ని మత సాంప్రదాయాలను సిద్ధాంతాలను కొద్దికాలంలోనే యిందు అంతర్లీనమగునట్లు చేయవచ్చును. కాని రాజకీయ నాయకులు మతాధికారులు యిందుకు అడ్డుపడక వారితోనే, ఈ మార్పును ప్రారంభించిన బాగుండును. బాబా యొక్క సహకారము, సంకల్పము వుంటే యిది అనూహ్యమైన విషయంగా కాక ఆచరణ సాధ్యమై, ఈ సాయి యుగంలో సాయి మతం మనదేశంలోనే కాక విశ్వ వ్యాప్తమై వర్ధిల్లి తీరునట్లుగా అనుగ్రహించమని సాయిని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః
ముప్పదవ అధ్యాయం సంపూర్ణం.
ఆరవరోజు పారాయణ ముగిసినది

ఏడవరోజు పారాయణ-బుధవారం
ముప్పది ఒకటవ అధ్యాయము

సాయిబాబా తొడుగు పొడవాటి లాల్చీలను తాత్యా షిరిడిలో దర్జీ పనిచేయు బాలాషింపితో కుట్టించెడివాడు. అప్పుడప్పుడు కొందరు భక్తులు బొంబాయి నుంచి పూనా నుంచి బాబా కొరకు మంచి మంచివి పెద్ద సైజుకోటులు తెచ్చి బహుకరించేవారు. వారి తృప్తికొరకు బాబా కొద్ది రోజులు తనవద్ద వుంచుకొని ఆ తరువాత తన ఆశ్రితులైన భక్తులకు యిచ్చి వేసెడివారు. యిదే విధముగా బాబా వాడు పెద్దసైజు బూట్లు, చిలుంగొట్టములు, సటకాలు, పెద్దసైజు గంపలలో జిలేబీలు, పేడాలు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పంపుచుండెడివారు. తినుబండారములు ఎక్కువగా వచ్చినప్పుడు షిరిడి గ్రామంలో తనవద్దకు తరచు వచ్చు పిల్లలను పిలిపించి ద్వారకామాయిలో తన తొడపై కూర్చోపెట్టుకుని వారికి కడుపు నిండుగా వాటిని పెట్టెడివారు. ఆనాడు అలా బాబావడిలో కూర్చున్న ఆ బాలురు ఎంత ధన్యులో కదా!

షిరిడి ప్రవేశమే సర్వదుఃఖ పరిహారమగునని, ద్వారకామాయిలో ప్రవేశించిన చాలు సుఖసంపదలు కలుగునని, బాబా నోటితో ఏ మాట అనిన అది జరిగి తీరునని, బాబాపాదములంటి ఏమిమొక్కిన అది సఫలమగుననే జన బాహుళ్యప్రచారం గాలిలో వ్యాపించు పరిమళమువలె మహారాష్ట్ర దేశమంతటా వ్యాపించెను. ఎందరెందరో భక్తులు వచ్చి ఈ శివావతారుడైన సాయినాధుని కేవలం భౌతికమైన యింద్రియాసక్తికరమైన కోరకలనే కోరుచుండెడివారు వారికి ఎన్ని రకముల బోధించిననూ తిరిగి వారి మనస్సు ప్రాపంచిక లంపటముల యందే లగ్నమైయుండెడిది తప్ప సత్యదృష్టి యందుండెడిది కాదు. బ్రహ్మజ్ఞానియు, తానే పరబ్రహ్మ రూపుడు అయిన షిరిడి సాయినాధుడు సాధారణ భక్తులు కోరు ఐహిక ధనాదులతో కూడిన కోరకలవలన చాలా బాధపడుచుండెడివాడు. దినదిన ప్రవర్ధమానమౌతున్న అట్టి భక్తులతో విసిగిపోయిన విషయము ఒకనాడు వారే స్వయముగా అన్నమాటలలోనే తెలుసుకుందాము. 'నేను చాలాకాలం నుంచి చూస్తున్నాను. అందరూ దొంగలే. అట్టి వారితోనే నేను మెలగవలసి వస్తున్నది. తప్పదు. అట్టి వారిని సరిదిద్దుటకు రేయింపగళ్ళు నేను శ్రమపడుచూ అల్లాను కూడ ప్రార్థించుచున్నాను. అల్లా నా

ప్రార్థనను అంగీకరించుటలేదు. నేను జీవించియున్నను అశువులు బాసినను నా ప్రార్థన అంగీకరించబడును. నేను వారిని వీరిని చేరి ప్రార్థించను. జనులు సాధారణముగా సత్ప్రవర్తన కలవారు కాదు. సాధువులు కారు. చంచలమైన మనస్సుగల వారు. ఏ కొద్దిమందో మంచి విషయముల యందు ఆసక్తులై నిజమైన ఆధ్యాత్మిక సాధన చేయుదురు. ప్రజలు అల్పబుద్ధులై నాకు బాధలను కలిగించు చుందురు. ఎప్పుడూ ప్రాకృతికమైన భోగ, ధనాదుల కొరకేనన్ను బాధించుచుందురు. ఈ విధముగ 1918 ప్రారంభంలోనే బాబా తన అవతారం చాలించక తప్పదన్నట్లు పరోక్షంగాను, సకారణంగాను సూచించారు.

అల్లా మాలిక్ అను అరబ్బీ పదము బాబా తరచు అంటూవుండేవారు. ఎవరైనా భక్తులు నీవు గొప్పవాడువు అని అనినప్పుడు "అందరి కంటే గొప్పవాడు దేముడు. అందరికీ యజమాని దేముడే దేవునితో ఎవరూ సమానము కాజాలరు. ఈ విశాల విశ్వాన్నంతటిన్నీ సృష్టించి పోషించి, ఆఖరికీ లయం గావించు ఆ దైవము ఎంత శక్తివంతుడో ఊహించండి. ఆ శక్తివంతుడైన దేముడు మనలను ఎక్కడ, ఏ విధముగా నిలిపెనో అదేవిధముగా మనము నిలిచి మనకిచ్చిన దానితో తృప్తిపడి సంతోషముగా వుండవలెను. భగవంతుడు మనలను ఎట్లు నిలుపదలచెనో, అట్లే నిలబడెదము. కష్టములు గాని, సుఖములు గాని ఎప్పుడు ఏమి మనకు యిచ్చునో వాటితోనే తృప్తిపడెదము. భగవంతుడొక్కడే స్వేచ్ఛగల స్వతంత్రుడు. మానవులంతా భగవంతుని ఆజ్ఞకు లొంగి పని చేయు పరతంత్రులు అనుభావనతో సర్వము భగవంతునికి అర్పించి, చేయు పనులలోని లాభనష్టములకు చిక్కుపడకయున్న మనము కర్మబంధ విముక్తి పొందగలము. యిదే మోక్షము. అట్లు కాక మనిషి భగవంతుడు తనను ఎట్లు నిలపదలచెనో, తనచేత ఏమి చేయించదలచెనో అట్లు చేయక, అజ్ఞానముతో, మోహముతో వేరు మార్గములందు తిరిగినచో అనవసరమైన పనులు చేయవలసి వచ్చును. ఆ కర్మల ఫలితముఅనుభవించుటకు అనేక జన్మములెత్తవలసి వచ్చును. కాబట్టి జ్ఞానము మోక్షదాయకమగును, అజ్ఞానము జననమరణ కారణ భూతమైన జన్మ పరంపరలకు మూలమని గ్రహించి సద్గురువు నుంచి జ్ఞానమును పొంది జన్మరాహిత్యమును పొందవలెను గాని, అన్యమాశించరాదు" అని చెపుతూ తన నుంచి మనం ఏమి ఆశించాలో, ఏమి ఆశించకూడదో కూడ వారే చెప్పేవారు.

యిదేవిధంగా ఈ భౌతిక ప్రపంచములో మనము తిరుగుచున్నప్పుడు మన ప్రవర్తన ఏ సందర్భములో ఎలా వుండాలో కూడ సాయి స్వయంగా అనేక మందికి వివరించి చెప్పారు. "ఎవరినీ ద్వేషించవద్దు. ఎవరితోను పోట్లాడవద్దు, అన్ని

ప్రాణులను ప్రేమించుము. ప్రతీకారపు బుద్ధి పెట్టుకొనవద్దు. ఎవరినీ నిందించవద్దు. నీ గురించి ఎవరైనా కటువు మాటలు పలికినచో, బాధపడక అక్కడ నుంచి తొలగిపోవుము. అప్పుడు వారి మాటలు నీకు గుచ్చుకొనవు. వారి చెడు మాటలు వారికే గుచ్చుకొని బాధపడెదరు. సోమరితనము వద్దు. ఎప్పుడు ఏదో ఒక మంచి పనిని చేయుచుండవలెను. ఏ పనిని చేయలేనప్పుడు. సద్గ్రంథ పఠనము గాని, లేక దైవనామ స్మరణగాని చేసుకొనుము. ఎవరి యందు ఈర్ష్య, అసూయ, ద్వేషభావములు పెంచుకొనవద్దు. పిల్లలు తల్లిదండ్రుల మాటలను వినవలెను. వారికి పనులలో సహాయపడవలెను. ఎప్పుడూ సత్యమును, కేవలము సత్యమునే పలుకవలెను. ఎవరైనా మనతో పది మాటలు మాట్లాడిన వారికి సమాధానము ఒక మాటలో చక్కగా అర్థమగునట్లు చెప్పవలెను. తిట్టుట, పోట్లాడుట, దెబ్బకు దెబ్బ అనుభావములను వదిలి వేయవలెను. కీడు చేయువారికి తిరిగి నీవు కీడు చేయవద్దు. వారికి కూడ మేలునే చేయుము."

సాధనా కార్యక్రమములలో నుండు వారికి బాబా చేసిన సూచనలు "స్వల్పముగా భుజింపుము, స్వల్పముగా నిద్రించుము. వివిధ భోజ్య పదార్థములకు ఆశపడరాదు. ఒకటి లేక రెండు రుచులతో తృప్తి పడవలెను. పరాపవాదము, జీవహింసలు పనికిరావు. ఆత్మజ్ఞానమును పొందవలెనన్న ధ్యానమత్యవసరము. ధ్యానము వలన మనసు శాంతించును. శాంతించిన మనస్సు సమాధి స్థితినొందును. కోరికలు విడనాటినగాని ధ్యానమునందు మనసు నిలవదు. ఋణానుబంధము లేక ఏ జీవియు నీ వద్దకురాదు. అందువలన మనిషిగాని లేక ఏ యితర ప్రాణిగాని నీ వద్దకు వచ్చినపుడు నిరాదరించి తరమివేయవద్దు".

ఈ విధముగా తన వద్దకు వచ్చు భక్తులకు వారి వారి స్థితినిబట్టి, పరిస్థితిని బట్టి అవసరమైన తగు సూచనలిస్తూ వుండెవాడు. త్రికాల ఆరతులతో, భక్త జనసందోహంతో ద్వారకామాయి నిత్యకళ్యాణం పచ్చతోరణంగా ఉంటున్నది. బూటీకి తాను నిర్మించిన వాడాలో కృష్ణ విగ్రహం ప్రతిష్ఠించాలనే కోరిక రోజురోజుకు తీవ్రమౌతున్నది. కాని బాబాను పదే పదే అడిగే ధైర్యంలేక తన కోరికను మనసులోనే దాచుకుంటున్నాడు. రామచంద్ర పాటిల్, బాలాషింపీలకు మాత్రం తాత్యా మరణమా సన్నమౌతున్నదని లోలోన భయంగానే వున్నది. నానా చందోర్కరు అవకాశం దొరికినప్పుడల్లా తన ఉపన్యాసాలద్వారా బాబామహిమలను ప్రజలందరికీ వివరిస్తూనే

వున్నాడు. దాసుగణు హరికథలు నిరంతరం సాగే గంగా ప్రవాహంవలె బాబా లీలలను మహారాష్ట్రమంతటా ప్రవహింపచేస్తున్నవి. బాపుసాహెబ్ జోగ్ నిత్య ఆరుతులతో బాబాను సేవిస్తున్నాడు. మహల్సాపతిలాంటి సన్నిహిత భక్తులు బాబా సాహచర్యాన్ని, దర్శన, స్పర్శన, సంభాషణల ద్వారా తనివితీరా అనుభవిస్తున్నారు. వేలకొలది సామాన్య భక్తులు షిరిడికివచ్చి, బాబాకు మ్రొక్కి తమ మనోభీష్టాలను పొందుతున్నారు. తనకు మరణమాసన్నమౌతున్నదని తెలియని తాత్యా నీటిపై తేలు తామర పుష్పమువలె స్వచ్ఛమైన మనసుతో బాబా సేవలో లీనమౌతున్నాడు. ఈ విధముగా సూత్రధారుడైన సాయి ఎవరితో ఏమి చేయించాలో ముందే నిర్ణయించినట్లుగా అన్ని పనులు స్రకమంగా జరుగుతునే వున్నవి.

ఆనందరావు కల

బాబా ఆదేశము ప్రకారము కాకా సాహెబ్ దీక్షిత్ వాడాలో ప్రతిరోజూ భావార్థ రామాయణమును చదువుచూ అందరికీ బోధించు చుండెను. ఒకనాడు ఏకాదశ స్కంధములోని ద్వితీయార్ధములోనవనాథులు వివరించిన భక్తి ప్రపత్తులను గురించి చర్చించెను. వారు బోధించిన భక్తిమార్గమును మనం చేరుటెట్లు అని కాకా సాహెబ్‌కు సంశయం కలిగెను. శ్యామా వారి భావనను అంగీకరించక తమకు బాబాపైగల భక్తి కూడ తక్కువ కాదని వాదించెను. అదేరోజు రాత్రి ఆ చర్చలలో పాల్గొన్న ఆనందరావు పాఖడే యనువానికి బాబా ఒక దృశ్యమునిచ్చెను. దానిని పాఖడే యిట్లు చెప్పెను. లోతైన సముద్రములో నడుము వరకు దిగి అక్కడ నిలచియుండుగా సాయిబాబా కనబడెను. వారు రత్న సింహాసనముపై కూర్చొని యుండిరి. వారి పాదములు నీటిలో నున్నవి. ఆ దృశ్యము నిజముగా నున్నది గాని కలయనుటకు వీలులేదు. నా ప్రక్కనే శ్యామా అక్కడ వుండెను. శ్యామా నన్ను బాబా పాదములపై పడుమనెను. వారి పాదములు నీటిలో యున్నవి. నమస్కరించుటెట్లు అని అంటిని. అప్పుడు శ్యామా నీటిలో నున్న నీ పాదములను బయటకు తీయుము బాబా అనెను. బాబా వెంటనే పాదములను పైకితీసెను. అప్పుడు నేను త్వరగా వారి పాదములపై నా శిరస్సునుంచితిని. బాబా నన్ను దీవించి యిక వెళ్ళుము నీవు మేలు పొందెదవు. ఆందోళన, భయము పొందవలసిన పనిలేదు, శ్యామాకు పట్టుపంచె దానము చేయుము. మేలు పొందెదవు అని చెప్పిరి".

నీటిలో బాబా పాదములుండుట యనగా మనోచాంచల్యముచే గురుపాదములను చూడలేమని భావన. స్థిర నమ్మకం గల వారితో సత్సాంగత్యము చేయుటచే గురువును పొందవచ్చునను భావన శ్యామా బాబాను పాదములు పైకి పెట్టమనుట. శ్యామాకు పట్టుపంచె దానమిచ్చుండయనగా స్థిరశక్తి గురువునందు గల వారిని సేవించి ఆదరించుట ద్వారా నీవు కూడ అతనివలె లాభమును పొందగలవను భావన. కలలో బాబాఆదేశము ప్రకారము పాఖడే ఒక పట్టుపంచెను తీసుకువచ్చి దానిని శ్యామాకీవ్వమని కాకా సాహెబ్‌ను వేడెను. శ్యామా అందుకు అంగీకరించకపోవుటచే "తీసుకొనుము" "తీసుకొనవద్దు" అను రెండు చీటీలనువేసి పాదుకలవద్ద పెట్టి అందులోఒక దానిని తీయగా తీసుకొనుము అని వచ్చుటచే శ్యామా దానిని అంగీకరించెను.

తిలక్-గీతారహస్యము

బ్రహ్మ విద్యను, సద్గ్రంథములను పఠించు వారిని బాబా ప్రోత్సహించి ఆశీర్వదించుచుండెడివారు. ఒకనాడు బాపూ సాహెబ్‌జోగ్ తనకు పోస్టులో వచ్చిన ఒక పుస్తకమును చంకలో పెట్టుకుని వచ్చి బాబాకు వంగి నమస్కరించగా అది క్రిందపడెను. బాబా దానిని అడిగి తీసుకుని కొన్ని నిముషములు దానిని అటు యిటూ త్రిప్పి చూసెను. అది తిలక్ వ్రాసిన గీతా రహస్యమను గ్రంథము. బాబా తన జేబులో చేయిపెట్టి ఒక రూపాయి బిళ్ళను తీసి పుస్తకముపై పెట్టి తిరిగి యిస్తూ, దీనిని శ్రద్ధగా పూర్తిగా చదువుము నీవు మేలు పొందెదవని చెప్పెను. ఈ విధముగా బాబా పవిత్ర పరచి యిచ్చుటచే ఆ గ్రంథపారాయణం వలన జోగ్ చాల మేలు పొందెను.

విషజంతువులను చంపుట-బాబా అభిప్రాయము

ఒకసారి దీక్షిత్ వాడా పైఅంతస్తులో దీక్షిత్ కొందరు మిత్రులతో మాట్లాడుచుండెను. కిటికీలో నుంచి ఒకపాము లోపలకి వచ్చెను. కర్రలను తీసుకుని చంపు ప్రయత్నము చేయగా అది ఏటో వెళ్ళిపోయెను. అక్కడి వారిలో గల ముక్తారామ్ అను భక్తుడు పాము తప్పిచుకొనుట మంచిదనగా హేమాద్రిపంతు అందుకు అంగీకరించక విషసర్పమును చంపుటే మంచిదనెను. వారిద్దరికీ రోజంతా గొప్ప వాగ్వివాదము జరిగెను. చివరకు ఆ విషయము బాబాను అడిగిరి. అప్పుడు బాబా యిట్లు జవాబిచ్చెను. తేళ్ళు, పాములలాంటి విషజంతువులతో సహా ఈ

సృష్టినంతటిని నడిపించువాడు దేవుడొక్కడే, వారి అనుమతి లేక ఏ జంతువు యితరులనుఏమీ చేయలేదు. ప్రపంచంలోని ఏ ప్రాణికీ తన యిష్టప్రకారము చేయు స్వేచ్ఛ లేదు. కాబట్టి చంపుట, కొట్టుట, తగాదాలు వంటి విషయములకు దూరముగా వుండవలెను.

హాజీసిద్దీక్ ఫాల్కే

యితడు ముస్లిం మత సిద్ధాంతం ప్రకారం మక్కా, మదీనాల యాత్ర చేసివచ్చెను. బాబా పేరు విని షిరిడికి వచ్చెను. కాని బాబా 9 నెలల వరకు మసీదులోనికి రానీయలేదు. అతడు నిరుత్సాహపడి శ్యామాను ఆశ్రయించెను. శ్యామా అతని తరుపున బాబాతో యిట్లనెను, బాబా! షిరిడికి వచ్చిన అనేక మందిని నీవు ఆశ్రయమిచ్చి ఆశీర్వదింతువు పాపమా ముదుసలిని అనుగ్రహించవేమి? అప్పుడు బాబా అల్లా ఒప్పుకోననిచో నేనేమీ చేయగలను. వారి అనుమతి లేనిదే మసీదులో పాదము పెట్టగలవారు లేరు. నీవు హాజీవద్దకు పోయి బారవీ నూతి దగ్గరకు రాగలడేమో అడుగుమనగా శ్యామా వెళ్ళి అతనిని కనుగొనగా అతడు అందుకు సిద్ధమే అయినట్లు చెప్పెను. మరల శ్యామాతో నాలుగు వేల రూపాయలను, నాలుగు వాయిదాలలో చెల్లించగలడేమో కనుగొనమనెను. శ్యామా కనుగొని 4లక్షల నిచ్చుటకు సిద్ధముగా నున్నాడని చెప్పెను. సరే మసీదులో ఈ రోజు మేకను కోసెదము. వానికి దాని మాంసము కావలెనో లేక కర్జూరములు కావలెనో కనుగొనుమని చెప్పెను. బాబా మట్టిపాత్రలో గల చిన్న ముక్క చాలునని చెప్పెను. ఈ సమాధానములను విని బాబా కోపించెను. చావడిలోనున్న హాజీసిద్దీక్ వద్దకు వెళ్ళి "గొప్పవానివలెనటించు చున్నావేమి? మక్కా యాత్రచేసితినని గర్వించి నన్ను గుర్తించలేకపోతున్నావు అని కోపగించినను తరువాత అతనిని తన దర్బారులో చేర్చుకొనెను. యిందులో బారవీనూతి దగ్గరకు రమ్మనుట అహంకారమునకు పరీక్ష. బారవినూతి దగ్గరకే ఎందుకు పోవలెను? అని తలచెనా అది అహంభావనకు గుర్తు. రూపాయల నడుగుటచే అతని త్యాగగుణము, శ్రద్ధ తెలియును, మాంసము కావెలనో కర్జూరములు కావలెనో అని అడుగుట జిహ్వాచాపల్య గుణమును తెలియజేయును. ఈ మూడువిధముల పరీక్షించిన మీదట అతనిని తన వానిగా బాబా చేసుకొనెను.

అబ్దుల్ బాబా (బడేబాబా)

అబ్దుల్ నాందేడు నివాసి. 16 సంవత్సరముల వయసు నుండి నాందేడులోని ఫకీరు అమిరుద్దీన్ అను సాధువును సేవించుచుండెను. 1889లో సాయిబాబా

స్వప్నములో అమీరుద్దీన్‌కు నిపించి. అతని చేతిలో రెండు మామిడి పండ్లను పెట్టి అబ్దుల్‌ను తన వద్దకు పంపమని చెప్పెను. మేల్కొని చూచుసరికి అతని చేతులలో నిజముగానే రెండు మామిడి పళ్ళు వుండెను. వాటిని అబ్దుల్‌కు యిచ్చి అతనిని షిరిడికి వెళ్ళి సాయిబాబాను ఆశ్రయించి వారి సేవ చేయమని చెప్పెను. వెంటనే అతడు షిరిడి వచ్చెను. అతనిని చూచి బాబా నా కాకి వచ్చినది అనెను. నీవు యితర ఆలోచనలు, పనులు లేకుండా నా సేవ చేయుమని బాబా అతనితో చెప్పెను. అప్పటి నుంచి అబ్దుల్ మసీదు దాని పరిసర ప్రాంతాలు, బాబా తిరుగుదారులు ఊడ్చి శుభ్రపరచెడివాడు. లెండీబాగ్, మసీదులలో గల లాంతర్ల గ్లాసులు తుడచి శుభ్రపరచెడివాడు. తీరిక సమయములలో బాబాచెంత కూర్చుని ఖురాన్ చదువుచుండెడివాడు. లెండీ తోటలోగల నందాదీపము దగ్గర అబ్దుల్ ప్రతిరోజు రెండు కుండల నిండుగా నీరు పెట్టెడివాడు. బాబా ప్రతిరోజు సాయంత్రము వేళ నిర్ణీత కాలమున అక్కడ కొంతసేపు కూర్చొనెడివాడు. అప్పుడు కుండలలోని నీటిని చేతిలో తీసుకుని ఏమేమో చదువుతూ అన్ని దిక్కుల వైపు చల్లెడివాడు. ఆ తరువాత లేచి నీరు చల్లిన ప్రతి దిక్కువైపు తిరిగి తీక్షణముగా చూచుచుండెడివాడు. అన్ని దిక్కుల యందు గల తన భక్తులను రక్షించుటకుగాను బాబా యిలా చేసెడివారని అది చూసిన భక్తులు అనుకొనెడివారు. అబ్దుల్ ఒకరాత్రి అంతయు మోకాళ్ళపై వ్రాలి తలకు ముందుగా చేతుల నుంచుకొని యుండగా చంద్రుని చూడదలచుకొంటివా? అని బాబా అడిగెను. అట్లు కొంతసేపున్న తరువాత నిద్రమత్తులో అబ్దుల్ బాబాపై పడెను. బాబా అతనిని తట్టి లేపి చంద్రుని చూచెదవులే లేచి పరుండుమని చెప్పెను. మరుసటి రోజు మధ్యాహ్నము దోసిటిలో నీరు తీసుకోగా అందులో చక్కగా చంద్రుడు కనిపించెను.

బాబా యొక్క దుస్తులను అబ్దుల్ ప్రతిరోజు షిరిడి దగ్గరలో గల వాగులో ఉతికి శుభ్రపరచెడివాడు.

యిమాం భాయి ఛోటేఖాన్

ఇతడు నిజాం ప్రభుత్వములో సిపాయి ఉద్యోగము చేసెడివాడు. ఒకసారి పోలీసులకు విచారణలో సరిగా తోడ్పడుటలేదని ఒక క్రైస్తవ ఉపాధ్యాయుడిని యతడు చావబాదెను. ఇతని దెబ్బలకు నోట నెత్తురు కక్కుతూ ఉపాధ్యాయుడు మూర్ఛిల్లెను. ఉద్యోగమును వదిలి పెట్టి రాష్ట్రము దాటి బయటకు వెళ్ళిపొమ్మని లేనిచో శిక్ష తప్పదని పై అధికారులు చెప్పిరి. అందుచే ఉద్యోగమునకు రాజీనామాచేసి నైజాం

రాష్ట్రమును వదిలి మహారాష్ట్రలో ప్రవేశించి బాబా ఆశీర్వాదముతో శిక్ష తప్పించుకోవలెనని అతడు షిరిడీకి వచ్చెను. రెండవ రోజు బాబాకు నమస్కరించగా, అల్లా మాలిక్! భయమువలదు నీకు శిక్ష పడకుండా చూచెదనని బాబా అభయమిచ్చెను. అతడు రెండు నెలలు షిరిడిలో వున్న తరువాత ఒకరోజు బాబా అతనిని నీవు యింటికి తిరిగి వెళ్ళుము. నీ భూములకు సంబంధించిన కేసులు నీకు అనుకూలముగా పరిష్కారమగును అని చెప్పెను. అతని మేనత్తకు అతనికి భూములతగాదా లుండెను. ఆ విషయము బాబాకు చెప్పకపోయినను తెలుసుకుని ఆశీర్వదించెను. ఈ విధముగా చాలాసార్లు షిరిడీకి వచ్చి ఛోటేఖాన్ బాబా యొక్క సలహాలను ఆశీర్వాదములను పొంది భౌతికముగానే కాక ఆధ్యాత్మికంగా కూడ కొంత పురోభివృద్ధి పొందెను.

బూటీకి ప్రాణగండం

ఒకరోజు షిరిడీకి నానాసాహెబ్ డేంగలే అను జ్యోతిష్కుడు వచ్చెను. ఒకనాడు అతడు బూటీ ని చూచి ఈ దినము నీకు ప్రాణగండమున్నదని చెప్పెను. ఆ తరువాత మామూలుగానే బూటీ ద్వారకామాయికివచ్చి బాబా పాదములచెంత కూర్చొనెను. బాబా బూటీతో "ఈ నానా ఏమనుచున్నాడు, నీకు మరణమున్నదనుచున్నాడు. మృత్యువు నిన్నెట్లు చంపగలదో చూచెదముగాక? నీవు భయపడకుము." ఆనాటి సాయంకాలము బూటీ మరుగుదొడ్డికి పోగా అక్కడ పెద్ద పాముండెను. నౌకగును కేకవేయగా అతడు కర్రను తీసుకుని వచ్చులోపల అది మాయమయ్యెను. బాబా యిచ్చిన అభయమును గుర్తు తెచ్చుకుని బూటీ సంతోషించెను. నిజమునకు ఆ విషసర్పము అతనిని కరించియుండవలసిన యోగముండవచ్చును. దాని కర్తవ్యము ప్రకారము అది వచ్చెను. కాని బాబా వాక్కుల ప్రభావం వలన అది అతనిని ఏమీ చేయలేకవెళ్ళిపోయెను.

అమీర్ శక్కర్

యితడు షిరిడీకి దగ్గరలోగల కొరాలే అను గ్రామంలోని కసాయి జాతికి చెందినవాడు. బాంద్రాలో కమీషను వ్యాపారము చేయుచుండెడివాడు. యితడు కీళ్ళవాతము జబ్బుతో బాధపడెను. బాబా మహిమలు విని వ్యాపారమును వదిలి బాబా చెంతకు చేరెను. చావడిలో కూర్చుని వుండమని బాబా ఆదేశించెను. అప్పట్లో చావడి చాలా త్వరగా చెమ్మగిల్లుతూ వుండెడిది. అతని రోగమునకు అలాంటి

వాతావరణము మంచికాదు అయినను బాబా వాక్కునకు తిరుగేమి. అతడు చావిడిలోనే కూర్చుండెను. బాబా ఉదయము, సాయంత్రము చావిడివైపు వెళ్లుచుండెడివాడు. రోజు విడిచి రోజు అక్కడ నిద్రించెడివాడు. అందువలన అమీరునకు బాబా సాంగత్యము ఎక్కువగా వుండెడిది. అతని వ్యాధి క్రమముగా తగ్గుచుండెను. బాధ తగ్గినట్లుండుటచే ఒకరోజు రాత్రి ఎవరికీ చెప్పకుండా కోపర్‌గాం వెళ్ళి ఒక సత్రములో నుండెను. అక్కడ ఒకఫకీరు మరణించుటకు సిద్ధముగా వుండి అమీరును త్రాగుటకు నీరు తెచ్చిపెట్టమని అడిగెను. అతడు నీటిని తెచ్చి యివ్వగా ఆ నీటిని త్రాగి ఫకీరు మరణించెను. ఈ విషయము పోలీసువారికి తెలిసినచో తనను అనుమానించవచ్చునని భయపడి బాబా అనుమతి లేక షిరిడి వదిలి వచ్చినందుకు యిది ఫలితమని గ్రహించి వెంటనే బాబా నామజపము చేయుచు తిరిగి షిరిడి చేరెను. సాయి ఆజ్ఞ ప్రకారము చావడిలోనే వుండి సంపూర్ణ ఆరోగ్యము పొందెను.

బాబా చావడిలో పడుకొనిన ఒకరాత్రి మధ్యభాగంలో బాబా లేచి అబ్దుల్‌ను లేపి నా పరుపు వైపుగా ఏదో దుష్టప్రాణి వచ్చుచున్నదని చెప్పెను. అబ్దుల్ లాంతరును తెచ్చి జాగ్రత్తగా చూడగా అమీరుశక్కర్ దిండు క్రింద పాముండెను. అమీరు పేరు చెప్పుటకు బాబా తన పేరును సూచించెను. ఈ విధముగా అర్ధరాత్రి అందరినీ లేపి అమీరును ప్రమాదము నుండి రక్షించెను. అతనిని రక్షించినట్లుగనే దివారాత్రములయందెల్లప్పుడు ఈ కథలను పారాయణ చేయు భక్తులను సాయి అన్ని వైపుల నుంచి రక్షించుగాక! అనిప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగించెదము.

ఓం శాంతి శాంతి శాంతిః

ముప్పది ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ముప్పది రెండవ అధ్యాయము

సగుణమేరు నాయక్

యితనికి షిరిడిలో ఒక అంగడి వుండెడిది. బాబా వద్దకు వచ్చు భక్తులు సాధారణంగా ఏదో ఒక వస్తువు కొరకు ఎప్పుడో ఒకప్పుడు ఈ అంగడికి వెళ్ళవలసి వచ్చెడిది. ఒకసారి మధురదాస్ అను భక్తుడు అంగడి దగ్గరకు వెళ్ళినప్పుడు నాయక్ తదితరులు కలిసి బాబా వద్దకు వచ్చిన భక్తురాలిని గురించి చాలా చెడ్డ మాటలు మాట్లాడు కొనుచుండెను. మధురదాసు కూడ ఆ మాటలలో జత కలిసెను. ఆ తరువాత అతడు తిరిగి ద్వారకామాయికి రాగా అతనితో బాబా "నాయక్ ఏమనుచున్నాడు. భగవంతుడిచ్చిన ఈ కాలమును సద్వినియోగ పరచుకొనవలెను. గాని కేవలము పరదూషణతో దుర్వినియోగపరచరాదు. యిక్కడకు మంచి వారితోపాటు చెడ్డవారు కూడ వచ్చుచుందురు. వారి గుణదోషములనేరి అందరితో చర్చించనేల" అని మందలించెను.

దేముడనగా ఎవరు?

ఒకరోజున కోపర్‌గాం నుంచి వచ్చిన ఒక వ్యక్తి బాబాను సమీపించి తనకుగల సందేహములకు సమాధానము కావలెనని కోరెను. ఏమా సందేహములని అడుగగా దేముడనగా ఎవరు, ఎట్లుండును, ఎక్కడుండును, అతనిని చూచుటెట్లు అని చెకచకా ప్రశ్నించెను. అతని మనస్తత్వము గ్రహించిన బాబా ఏమీయు మాట్లాడక ఒక భక్తుని పిలిచి భాగ్‌చంద్ మార్వాడి దగ్గరకు వెళ్ళి బాబాకు 100 రూపాయలు కావాలని అడిగి తీసుకురమ్ము అని చెప్పెను. ఆ భక్తుడు వెళ్ళి తిరిగి వచ్చి నా దగ్గర నూరు రూపాయిలు లేవు, నమస్కారము లని చెప్పుము అని నాడని చెప్పెను. అప్పుడు బాబా నానా చందోర్కరును పిలిపించి నూరు రూపాయిలు కావలెనని కోరెను. నానా చందోర్కరు ఒక చీటి వ్రాసి అదే భాగ్‌చంద్ మార్వాడికి అదే భక్తునితో పంపెను. ఒక్క నిముషములో అతడు పైకముతో తిరిగి వచ్చి నానా చందోర్కరు చేతిలో వుంచెను. అతడు దానిని బాబా కిచ్చెను. దేముని గురించి ప్రశ్నించిన వ్యక్తి తొందరపడుతూ ప్రక్కనే గల దాసుగణుతో నేనడిగిన దానిని నాకు సమాధానము చెప్పకుండా 100 రూపాయల అప్పు గురించి ప్రయత్నిస్తున్నారేమి అని అడిగెను. దాసుగణు యిదంతయూ నీ కొరకే చేయుచున్నారు. బాబా కబురు పంపినచో డబ్బులేదనిని బాగ్ చాంద్ నానా చందోర్కరుకు వెంటనే యిచ్చెను,

గమనించితివి కదా! దేముని గురించి తెలుసుకొనవలెనన్న ముందు కొంత అర్హత సంపాదించుకొనవలెను. లేనిచో ఏమి చెప్పినను అర్ధముకాదని చెప్పెను.

సంసారము - భయంకరము

బాబాతో సాంగత్యము జన్మజన్మల పుణ్యఫలము, అలాంటి గత జన్మపుణ్యముచే నానా చందోర్కరు బాబా ద్వారా అనేక విషయములను తెలుసుకొనిన తరువాత అతనికి ఈ సంసార జీవితము భయంకరమైన సముద్రమువలె తోచెను. ఆధ్యాత్మికముగా వేయు ప్రతి ముందడుగుకు సంసార జీవితము అడ్డుగా తోచెను. అనుభవము ద్వారా ఆతడు ఈ సత్యమును గ్రహించెను. 1918లో ఒకనాడు మధ్యాన్నం బాబా ఏకాంతంగా వున్న సందర్భంలో బాబా! నాకు సంసార జీవితము భయంకరముగా తోచుచున్నది. సంసార బంధములయందు నాకు బుద్ధి పుట్టుట లేదు. ఎటులైనను నన్ను ఈ బంధమునుండి విముక్తిని చేయుమని ప్రార్థించెను. ఈ మాటలు విని బాబా చిరునవ్వు నవ్వెను. నీ మాటలలో కొంత వరకు సత్యమున్నది. కాని మిగిలినదంతయూ అసత్యము, అర్ధరహితము. మానవుడు జీవితములో పొందు దుఃఖములు, బాధలనుండి తప్పుకొనవలెనన్నచో సంసారమునువీడి అరణ్యములలోనికి పరుగెత్తినచో తప్పునని నీ అభిప్రాయము. కాని అది ఒట్టి భ్రమ, అసత్యము, అసంగతము. ఎట్లందువా! నీవెక్కడకు వెళ్ళినను నీ శరీరము, మనసు నీ వెంటనే వుండునుగదా! అవి నిన్ను విడువవు. నీవెక్కడ వున్నను అవి ఏదో ఒక విధమైన సుఖ సంతోషములను కలిగించుచుండును. ప్రారబ్ధకర్మ రూపములే సుఖ దుఃఖములకు మూలములు వాటిని ధైర్యముతో, ఓర్పుతో ఎదుర్కొని సక్రమమైన పద్ధతిలో జీవితమును గడుపుటే ఏకైక తరుణోపాయము కేవలము సంసారమును వదిలినంత మాత్రమున సంతోషమును పొందలేవని చెప్పెను. ఆధ్యాత్మిక జీవితంలో నడుచు ప్రతివారికి జీవితములో జరుగు వడిదుడుకులకు ఎప్పుడో ఒకప్పుడు యిలాంటి వైరాగ్య భావము కలుగును, సమస్యలను ధైర్యముతో ఎదుర్కొని నిలబడవలెను కాని సంసారమును త్యజించుట సమంజసముకాదు. యిదే సాయి సందేశము.

పండరీపురము ప్లీడరు

పండరీ పురములో దేశపాండే యను ప్లీడరు కలడు. అక్కడి సబ్‌జడ్జి యైన నూల్కరు అనారోగ్యముతో బాధపడుచూ బాబా అనుగ్రహం కోసం కొన్ని రోజులు షిరిడిలో వుండెను. అనారోగ్యమునకు మందులు వాడుకొనవలెనుగాని ఫకీరుల

దగ్గరకు పోయినచో వారేమి చేయుదురని వాగ్వివాదము జరిగెను. ఈ వివాదపు చర్చలో దేశపాండే పాలుపంచుకొనెను. సాయిబాబానుకూడ నిందించెను. యిది జరిగిన చాలా సంవత్సరముల తరువాత అతడు షిరిడికి వచ్చెను. సాయిబాబాను దర్శించి పాదములంటి నమస్కరించి ఒక మూల ద్వారకామాయిలో కూర్చొనెను బాబా అతనివైపు తిరిగి "జనులెంత టక్కరులు. పాదములపై పడెదరు. దక్షిణ నిచ్చెదరు. కాని చాటున నిందించెదరు" అనెను. బాబా తన గురించే చెబుతున్నారని సంవత్సరాలకు పూర్వం పండరీపురం కోర్టులోగల ప్లీడర్ల గదిలో ఏమి జరిగినది బాబాకు ఎట్లు తెలిసినదా అని ఆశ్చర్యపడెను. షిరిడి పండరికి మూడు వందలమైళ్ళ దూరములోవున్నది. ఈ మధ్యలోగల చరాచర వస్తు సముదాయములేవీ బాబా సర్వజ్ఞత్వమునకు అడ్డరాలేక పోయినవని అతడు గ్రహించెను. మనము మంచి చేసినా చెడు చేసినా బాబా దృష్టినుంచి తప్పించుకొనుటకు వీలులేదని కూడ గ్రహించెను. ఆ రోజునుంచి ఎవరిని గూర్చి చెడ్డగా మాట్లాడరాదని. అనవసరముగా వ్యాఖ్యలలో పాల్గొనరాదని నిర్ణయించుకొనెను. ఈ విధముగా బాబా దర్శనము అతనిని సన్మార్గమున పెట్టెను.

దీక్షా కాలములు

బాబా తన వద్దకు వచ్చు భక్తులలో వారి వారి స్థితిని బట్టి కొన్ని దీక్షలు యిచ్చి ఆ దీక్షా కాలములో వారిని అనేక విధములుగా తీర్చిదిద్దెడివాడు. తాత్యాకు శాశ్వత బ్రహ్మచర్య దీక్షను యిచ్చెను. హరి సీతారాం దీక్షిత్, కాకా దీక్షిత్‌లకు షిరిడిలోనే వుండి చేయు 9 నెలల వాన ప్రస్థ దీక్షా కాలము విధించెను. ఆ దీక్షా కాలములో వారిని కుటుంబ సభ్యులతో గాని, యితర జన సమూహముతో గాని స్వేచ్ఛగా తిరుగనీయ లేదు. ఉపాసనీ బాబాకు విధించిన నాలుగు సంవత్సరముల దీక్షా కాలము ముగియక ముందే ఆయన షిరిడి విడిచి వెళ్ళిపోయెను. యిదే విధముగ కొంత మందికి గ్రంధ పారాయణ దీక్షా కాలము, మరి కొందరికి నామ సంకీర్తన దీక్షా కాలములు నిర్ణయించెడివాడు. బాబా నిర్ణయించిన ప్రకారం ఆయా దీక్షాకాలమును గడుపు వారు ఎంతో మేలు పొందెడివారు.

ఖపర్డే కుమారుని ప్లేగు జబ్బు

ఖపర్డే భార్య తన చిన్న కుమారునితో కొన్ని రోజులు షిరిడిలో వుండగా ఒకసారి ఆ బాలునికి ప్లేగు జ్వరము వచ్చెను. శరీరముపై బొబ్బలు లేచెను. ఆమె

చాలా భయపడెను. దీక్షిత్, శ్యామా మొదలైన వారితో మాట్లాడి మంచి డాక్టరునకు చూపించవలెనని ప్రయత్నించినది. కాని షిరిడిలో ఇంగ్లీషు వైద్యం చేయు డాక్టరు లేనందున అతనిని తమ స్వస్థలమైన అమరావతికి తీసుకు వెళ్ళుటకు ప్రయత్నించెను. ఆ స్థితిలో బాలుని అంత దూరం తీసుకుపోవుటకు కూడ ధైర్యం చాలలేదు. కుమారుని కేమగునో అని భయపడి ఆమె కన్నీరు మున్నీరుగా ఏడ్చెను. శ్యామా ఆమెనోదార్చి సాయి వుండగా భయపడవలసిన పనిలేదని చెప్పి కుమారుని తీసుకుని బాబా పాదములపై పడవేయుమని చెప్పెను. ఆ సాయంత్రము లెండీబాగ్‌కు వెళుతున్న బాబా వద్దకు ఆమె పరుగెత్తుకొని పోయి పాదములపై పడెను. కన్నీళ్ళతో బాబా పాదములను కడిగెను దుఃఖ భారముతో మాట్లాడలేక ఆమె గొంతు మూగబోయెను. బాబా పాదములపై నుంచి పైకి లేవ లేకపోయెను. ఆమె స్థితిని గమనించిన బాబా ఆమెను లేవనెత్తి అమ్మా! ఆకాశము మేఘావృతమై యున్నది. కాని త్వరలో మేఘములు చెదరిపోయి ఆకాశము మామూలుగా అగును అంటూ తన కఫినీనిపైకెత్తి చంకలోగల కోడి గ్రుడ్డంత ప్లేగు పొక్కులను నాల్గింటిని చూపెను అక్కడున్న వారితో నా నిజభక్తుల కొరకునేనెట్లు బాధపడెదనో చూడుడు అని వాటిని చూపించెను. యితరుల బాధలను తాననుభవించి వారికి స్వస్థతను చేయుసాయి కంటే మనకింకెవరు మిన్న. రెండు రోజులలో పిల్లవాడు మామూలు ఆరోగ్యమును పొందెను.

బాబా యిటుకరాయి విరుగుట

వెంకుసా యిచ్చిన యిటుక రాయిని బాబా ప్రాణప్రదంగా చూసుకొనెడివాడు. పరుండునప్పుడు తల క్రింద వుంచుకొనెడివాడు. కూర్చున్నప్పుడు దానిపై చేతినివేసి ప్రక్కనే వుంచుకొనెడివాడు. ఆ యిటుక రాయితన గురుదేవుని ప్రతి రూపం అని తరచుగా అంటూ వుండేవారు. అది 1918వ సంవత్సరం ఆగష్టు నెల. ఒక గురువారం నాడు మసీదులోని లాంతరులను బాగుచేసి మసీదును శుభ్రపరచు అబ్దుల్ ఆ యిటుక రాయిని తన చేతిలోనికి తీసుకొనగా అది క్రిందపడి రెండు ముక్కలయ్యెను. ఆ తరువాత వచ్చి చూచిన సాయి చాలా బాధపడెను. యిటుక విరుగుట కాదు. నా అదృష్టమే విరిగి ముక్కలైనది. యిది నా జీవితపు తోడుగా యిన్ని రోజులు వున్నది. దీనితోనే నేను ఆత్మ సమాధానము చేయుచుండెడివాడను. ఈ యిటుక నా జీవితముతో సమానము. అది ఈ రోజునన్ను విడిచినదని చెప్పెను. ఈ సంఘటన ద్వారా కూడ బాబా తన నిర్యాణమును నిగూఢముగా సూచించెను.

షంషుద్దీన్ మియా

ఈ సంఘటన జరుగుటకు ముందుగా అనగా జూన్ 1918లో బాబా యిస్లాం మత సాంప్రదాయన్ని అనుసరించి కూడ మరణించుటకు ముందుగా చేయుకొన్ని ఏర్పాటులను చేసెను, ఔరంగాబాదులో గల షంషుద్దీన్మియా అను ముస్లిం ఫకీరునకు బాబా, మౌలు, కొవాలి, న్యాస్‌లు జరిపించుటకు గాను 250 రూపాయలను ఒక పూలమాలను షిరిడిలోగల బడె బాబా కుమారుడు ఖాశిం ద్వారా పంపెను. దానితోపాటుగా తన సందేశమును కూడ ఈ విధముగా పంపెను. "తొమ్మిదవ నెల తొమ్మిదవ తారీఖునాడు తాను వెలిగించిన దీపమును అల్లా తీసుకుని వెళ్ళుచున్నాడు. అది అల్లా అనుగ్రహము." మరుసటి రోజు ఔరంగాబాదు చేరగానే ఖాసింను చూచి షంషుద్దీన్ "షిరిడిలో బాబా యిచ్చిన సందేశమునంతటిని ఖాసిం చెప్పక ముందుగా అతడే చెప్పెను. బాబా పంపిన పైకముతో వారి కోరిన విధముగనే బాబా పేరున పైగంబరును గూర్చి స్తోత్రగానమును చేయించెను. మహమ్మదీయ సాధుసత్పురుషుల ఉద్దేశించి తబలా వాయించబడెను. పైకమంతయు ఖర్చు పెట్టి వంటలు చేసి అక్కడి వారందరికీ భోజనములు పెట్టించెను. మరుసటి దినము ఉదయము బన్నేమియా అను గొప్ప ఔలియా దగ్గరకు వారిద్దరూ కలిసి వెళ్ళిరి. బన్నేమియా విచిత్రముగా నిలబడి యుండెను. దగ్గరకు ఎవరు వచ్చినా అతడు ఆగ్రహించి తిట్టుచూ, కొట్టుచుండెడివాడు. వారి దగ్గరకు వెళ్ళవద్దని అందరూ హెచ్చరించిరి. షంషుద్దీన్ ధైర్యము చేసి సాయిబాబా పంపిన పూలమాలను వారి మెడలో వేసి బాబా యిచ్చిన సందేశమును యధాతధముగ చెప్పెను, అది విన్న బన్నేమియా కన్నులవెంట జలజలా కన్నీళ్ళు కారినవి. బాబా శరీరమును విడచుచున్నందుకు ఆ మహమ్మదీయ యోగి కన్నీరు కార్చెను. తొమ్మిదవ నెల తొమ్మిదవ తారీఖు అనగా అరబ్బీ ఉర్దూ భాషల లెక్కలలో 1918 లోని అక్టోబరు 15వ తేదీ నాటి ఏకాదశి ఘడియలకు సరిపోవును.

యిచ్ఛా మరణము

బాబా చూపిన ఈ చర్యలన్నీ నిగూఢముగనే వుండుటచే ఏ ఒక్కరికి బాబా మరణించెదరన్న ఆలోచనే లేదు. అందువలన భక్తుల రాకపోకలు, ద్వారకామాయిలో ఆరతులు, భక్తులకు బాబా యిచ్చు ఆశీర్వాదములు, అభయములు, ఊదీ ప్రసాదము మామూలుగానే జరుగుచున్నవి. బాబా జీవితమును గురించి ఎవరికీ ఏ విధమైన అనుమానం కూడ రాకుండా బాబా చాలా జగ్రత్తపడినాడు. బాబాకు,

అదృశ్య దివ్యజ్యోతుల రూపంలో వున్న ద్వారకామాయి, గురుధన్, పెంకూసాలకు తప్ప బాబా నిర్యాణ విషయము మిగిలిన వారికెవ్వరికీ తెలియదు. వారంతా బాబాను నిత్య పూజలతో సేవిస్తూ ఆరాధిస్తూ పూజిస్తూ ఆనందిస్తున్నారు.

అగష్టు నెలదాటి సెప్టెంబరు ప్రవేశించినది. ఊరిలో గల వర్తకులు, యితర ప్రాంతముల నుంచి వచ్చు వర్తకులు బాబాను వ్యాపారాభివృద్ధి కోసం రెట్టింపు లాభాల కోసం ఎక్కువగా ప్రార్థిస్తూ వుండేవారు. కేవలం ధనం కోసమే కోరుతూ పరోక్షంగా వారు పెట్టే బాధలను బాబాపైకి కనిపించనీయక లోలోపలే దాచుకునేవారు. రాత్రులందు గురుధన్, ద్వారకామాయి, పెంకూసాలతో కలిసి మూర్ఖత్వంతోను, అజ్ఞానంతోను తనను కోరికల రూపంగా బాధించే మానవుల చేష్టలను గూర్చి చర్చించేవారు సాయి. కాదు, లేదు అనుమాటలు సాయి వద్దలేవు కాబట్టి ఎవరు వచ్చి ఏవి అడిగినా వారికి అర్హతలేక పోయినప్పటికి ఎంతో కొంతైనా అనుగ్రహించక తప్పుటలేదని అలా ఎక్కువ కాలం జరుగుట సృష్టి నియమాలను వుల్లంఘించటమే అవుతుంది కాబట్టి ఈ సమస్యకు పరిష్కారం శరీరాన్ని వదలటమేనని వారు నలుగురు నిర్ణయించారు. శారీరక ధర్మాన్ననుసరించి యిప్పటికే 83 సంవత్సరాలు ఈ శరీరానికి పూర్తి కాబోతున్నవి గనుక యిక దీనిని త్యజించక తప్పదని కూడ వారు నిర్ణయించారు. కేవలం భౌతిక శరీరం వదలినా సాయిశక్తి యధాతధంగా భూమిమీద వుండి సాయి ప్రేమతత్వాన్ని విస్తృత ప్రచారం చేయించి మానవ జాతిలోని మూర్ఖత్వాన్ని, మూఢ ఆచారాలను, విద్వేషాలను పారద్రోలి జనులందరికీ శాంతి సౌఖ్యాలను ప్రసాదించాలని అందుకు గాను సాగేసాయి తత్వ ప్రచారంలో మిగిలిన ముగ్గురూ కూడ కలిసి మొత్తం నలుగురు రాగల 500 సంవత్సరముల వరకు భూమండలమంతా ప్రేమతత్వాన్ని నింపగలందులకు నిశ్చయించుకున్నారు. అవసరాన్ని, దైవశాసనాన్ని బట్టీ సాయి యింకో శరీరాన్ని కూడ పొందిన పొందవచ్చునని నిర్ణయించారు. తన యిష్ట ప్రకారం మరణాన్ని తీసుకోగల శక్తి బాబాకు వుంది కాబట్టీ వారు అంతిమ ఘడియలను సృష్టించుకొనుటకు ఎదురుచూచు చున్నారు.

అది సెప్టెంబరు నెల 28వ తేదీ మధ్యాన్న ఆరతి జరుగుతున్నది. బొంబాయి నుండి వచ్చిన ఒక వర్తకుల గుంపు ద్వారకామాయిలో ప్రవేశించింది. వారిని చూడగానే బాబా మనసు కలత చెందినది. ప్రజలకు అవసరమైన ఆహార ధాన్యాలను విపరీతంగా ఖరీదు చేసి గోదాములలో దాచి వచ్చారు వాళ్ళంతా. బాబాను

ప్రార్థించి రెట్టింపు రేటు వచ్చునట్లుగా అనుగ్రహించమని ప్రార్థించుటకు వందల కొలది కరెన్సీ నోట్లను దక్షిణగా యిచ్చుటకు తెచ్చారు. విషయాన్ని గ్రహించిన బాబా ఆరోజు ఆరతి అయిన తరువాత భక్తులకు దర్శనంలేదని అందరినీ వారించాడు. వ్యాపారులు శ్యామా, నానా చందోర్కరులను సమీపించి తాము బొంబాయి నుంచి వచ్చామని వెంటనే తిరిగి వెళ్ళిపోవాలని దయచేసి బాబాతో ఒకసారి మాట్లాడే ఏర్పాటు చేయించమని ప్రార్థించగా. అమాయక భక్తుడైన శ్యామా బాబా వలదని వారించినా వినకుండా బాబాను ఒప్పించి మరీ వారిని ద్వారకామాయిలోనికి తీసుకువెళ్ళాడు. పరిస్థితిని గమనించిన బాబా యిక కాలమాసన్నమైనదని గ్రహించి ఆరోజునుంచే శరీరంలో ఉష్ణశక్తిని పెంచగా పైకి జ్వరం వచ్చినట్లు అనిపించినది. భక్తులు తనను పెట్టే బాధలు భరించలేక యిచ్ఛా మరణాన్ని పొందదలచి చూచువారలకు సహజ మరణంలా వుండునట్లు చేయుటకు శరీరాన్ని సుష్కింప చేయుట కొరకు ఆహారాన్ని తీసుకోవటం మానేశాడు సాయి. సాధారణంగా మానవులు అనారోగ్యంతోనో, ప్రమాదాలు వలననో, వృద్ధాప్యం వలననో మరణిస్తారు. కాని సాయి కేవలం భక్తుల కారణంగానే శరీరం నుంచి ప్రాణశక్తిని వేరు చేయవలసి వచ్చినది. ఈ విధముగా జీవితాంతం భక్తులకోసం శ్రమపడిన సాయి మరణాన్ని కూడ భక్తుల కోసమే కోరి పొందవలసి వచ్చినది.

ఓం శాంతి శాంతి శాంతిః
ముప్పది రెండవ అధ్యాయం సంపూర్ణం.

ముప్పది మూడవ అధ్యాయము

క్రిందటి అధ్యాయములో బాబా ఏవిధముగా స్వార్థపరులైన భక్తుల చేతనేకాక ఆశ్రితులైన భక్తులచేత కూడ వారికి కూడ తెలియని రీతిలో బాధలను అనుభవించెనో తెలుసుకొంటిమి కదా. కాబట్టి శిష్యులెవరైనా ఏ చిన్న విషయములోనూ గురువును వ్యతిరేకించరాదు. ఒక్కొక్కప్పుడు ప్రేమాభిమానములతో కూడిన శిష్యులు గురువు వద్దని వారించినా కొన్ని పనులను చేయుచుందురు. అట్టి పనులవలన వారు గురువును భాధించుచున్నారని తెలుసుకొనవలెను. గురుద్రోహం దైవద్రోహముతో సమానము.

జూలై నెల చివరి నుంచి తాత్యా ఆరోగ్యము క్షీణించెను. రామచంద్రపాటిల్ తాత్యాను గురించి భయపడుతూ ఎప్పుడూ అతనిని కనిపెట్టుకొని చూచుచుండెను. అతనికి మరణమాసన్న మౌతున్నదని గ్రహించిన పాటిల్ తాత్యా రుచులను పరోక్షంగా తెలుసుకుని వాటినన్నిటినీ తీర్చుచుండెను. పాపము తాత్యాకు తన మరణ విషయము తెలియదు కదా! అనారోగ్యముతో బాధపడుతున్నా తొలిదశలో ఆనందముగానే అతడుండెను. పాటిల్ మాత్రము తీవ్ర మానసిక వ్యధకు గురి అగుచుండెను. ఆగష్టు నెలదాటి సెప్టెంబరు కూడ పూర్తియగునాటికి తాత్యామంచము పట్టెను ద్వారకామాయి వరకు కూడ రాలేని స్థితి ఏర్పడెను. క్షయవ్యాధి ముదురుటచే యిక తాత్యా బ్రతుకడని అందరూ అనుకొనుచుండిరి, తాత్యాకు మాత్రం తన గురించి బాధలేకుండెను. అతడు ఏకాకి. బ్రహ్మచారి. బాబా సహచర్యంలో శరీర భ్రాంతిని వదులుకో గలిగిన వాడగుటచే మరణ మనిననూ అతనికి భయముపోయెను. బాబాకు బట్టలు ఎవరు మార్చుచుంటిరో రాత్రిపూట పక్కసరిగా వేయుచుంటిరో లేదో అని ఎల్లప్పుడు బాబాను గురించే ఆలోచించుచుండెడివాడు.

పవిత్రగ్రంథ పారాయణ

అక్టోబరు 1వ తేదీనాడు ఉదయం వజే అను బ్రాహ్మణ భక్తుడు వచ్చి బాబాకు నమస్కరించెను. బాబా అతనిని ఆశీర్వదించి వూదీ ప్రసాదమునిచ్చునపుడు అతని చేతిలో ఏదో గ్రంథముండుట చూచి బాబా ఏమిటదని అడుగగా శ్రీధరకవి రచించిన రామ విజయమనే పుస్తకమని అతడు సమాధానము చెప్పెను. దానిని

బాబా తీసుకుని లోపలి పేజీలను చాలాసేపు తిప్పిచూచెను. ఆ తరువాత ఆతనితో ఈ గ్రంధమును యిప్పటి నుంచే నా వద్ద కూర్చుని నాకు వినిపించునట్లుగా చదువుమనెను. అతడు బాబా యొక్క అజ్ఞను గొప్పవరంగా భావించి వెంటనే పారాయణను సాగించెను. పారాయణ చేయుచున్నప్పుడు బాబా మధ్యలో అపుమని కొన్ని ముఖ్య విషయముల వద్ద అక్కడున్న భక్తులందరకూ తెలియునట్లు వాఖ్యానము చేయుచుండెను. ప్రతిరోజు ఈ కార్యక్రమము ఉదయము సాయంత్రము జరుగుచుండెను. బాబా వద్దకు వచ్చు భక్తులు కూడ ఈ పారాయణమును వినుచుండిరి. ఎవరైనను మరణించుటకు ముందు దైవ కధలను చదివి వినిపించుట ఆచారము. అదే విధముగా బాబా ఈ విషయమును కూడ నిగూఢముగ వుంచెను. మొత్తము 14 రోజులపాటు మూడుసార్లు పారాయణ చేయించెను. తాత్యా జబ్బు నానాటికీ పెరుగుచుండెను. క్షయ వ్యాధి ముదిరి రక్తము కక్కుచుండెను. అతడు మరణించు రోజులు దగ్గర పడుచున్నవని అందరూ భావించిరి.

అది 8-10-1918వ తేదీ. బాబా బాగా నీరసించిపోయెను. మసీదులో గోడకానుకుని కూర్చొనుచుండెను. అరతులు, పూజలు మామూలుగనే జరుగుచుండెను బాబా చాల బలహీనముగా వుండుటచే భక్తుల లెవరినీ దగ్గరకు రానీయకుండా దూరము నుంచే మ్రొక్కునట్లుగా నానా, శ్యామాలు చూచుచుండిరి. కొందరు వ్యక్తులు ఒక పులిని బండిపై ఎక్కించి దానిని వూరూరా త్రిప్పుతూ డబ్బు సంపాదించుకొనుచుండిరి షిరిడికి వచ్చి ఆ పులిని ద్వారకామాయి ముందుకు తీసుకువచ్చిరి. అది జబ్బుగా వున్నట్లుగా నీరసించి బలహీనముగా వుండెను. బాబాను చూడగనే అది రెండు కాళ్ళను ముందుకు చాచిపడుకొనెను. ఆ పులి కూడ బాబాకు నమస్కరించుచున్నట్లు కనపడెను. బాబా తన దృష్టిని పులి కళ్ళలోకి కలిపి చాలాసేపు చూచెను. పులి కూడ అదే విధముగా బాబావైపు చూసి కన్నీరు కార్చెను. అది ఏ జన్మ బంధమో బాబా యందు చూపి నిలిపిన పులి వారిని చూచుచూ ప్రాణములు వదిలెను. ఈ విధముగా పులికి బాబా సద్గతి కలిగించెను.

చివరి రోజులు

బాబా ఎంత నీరసపడినప్పటికి భక్తులకు తగుసూచనలిస్తూనే వుండిరి. భక్తులనుద్ధరించుటకే వారి మానవజన్మ. వారి శరీరము మనకోసమే అవతరించినది గాని వారి కోసము కాదు. సాయి తన కొరకు ఎప్పుడూ ఏమిచేసుకొనలేదు.

మానవులందరికీ శాంతి సౌఖ్యములను ప్రసాదించుటే వారి జీవిత లక్ష్యము. ఈ లక్ష్యసాధనకే వారు అహోరాత్రములు కృషిచేసేవారు. అర్ధరాత్రి సమయములో కూడ వారు ఏకాంత ధ్యాననిష్టలో వుండి ఎక్కడెక్కడో వున్న భక్తులను కాపాడు చుండెడివారు. బాబాకు అనారోగ్యముగా వుండుట, వారు కావాలని ఆహారమును తీసుకోకుండ శరీరమును షుష్కింపజేయుట చూచిన భక్తులు యిది కూడ ఏదో ఒక వింత చర్యేనని దీని పర్యవసానం త్వరలో తెలుస్తుందని భావించారు గాని బాబా జీవితాన్ని వదులుతారని ఎవరూ వూహించలేదు. బాగోజీషిండే, మహల్సాపతి, అబ్దుల్, నానా చందోర్కర్, శ్యామా, లక్ష్మీబాయి, భాటే, దీక్షిత్ మొదలైన వారంతా పగలు రాత్రి బాబాను గమనిస్తూనే వుండెడివారు. వీరందరినీ మభ్యపెట్టి భ్రమలో పడవేయుటకా అన్నట్లుగా బాబా అప్పుడప్పుడు లేచి లెండిబాగ్‌కు, బూటీవాడాకు వెళుతూ వుండేవాడు. చావడి ఉత్సవము కూడ మామూలుగానే జరుగుచున్నది. శ్యామా మామగారైనలక్ష్మణ్ మామా కూడ బాబాకు అరతులు యిచ్చునపుడు జోగ్‌నకు సహకరించెడివాడు. బూటీ, దీక్షిత్‌లు బాబాతో పాటుగా కూర్చుని భోజనము చేయుచుండెడివారు. అందుచే బాబా లేకుండా వారికి భోజనము రుచించుటలేదు. బాబా మాత్రము అలవాటు ప్రకారము ప్రతిరోజు భిక్షకు వెళ్ళి భిక్షాన్నమును కొంత ధునిలో వేసి మిగిలిన దానిని పశు పక్ష్యాది జంతువులకు పెట్టుచుండెను.

బాబా శరీరము బాగా నీరసించినట్లుగా కనిపించుచుండెను. నిప్పులను క్రక్కునట్లుండు కన్నులులోనికి పోయెను. అయిననూ వారి చూపులోని తీవ్రత ఏ మాత్రం తగ్గలేదు. వచ్చిన భక్తులందరకూ బాబా తగిన సలహాలను విభూది ప్రసాదము యిచ్చి పంపుచుండెను. పండరీపురములో తన కార్యక్రమము వుండుటచే ముందుగానే దాసుగణు బాబా అనుమతి తీసుకుని వెళ్ళిపోయెను. అక్టోబరు 13వ తేదీ నుంచి బాబా ఉదయం లెండీబాగ్‌కు వెళ్ళుట, భిక్షాటనలను కూడ మానివేసెను ద్వారకామాయిలోనే స్థిరముగా కూర్చొని జాగరూకుడై భక్తులందరకు ధైర్యమును చెప్పుచుండెను. 1916లో కూడ బాబా ఒకసారి జబ్బుపడెను. యిప్పుడు కూడ అదే విధముగా జబ్బు నుండి కోలుకొనుననే ధైర్యము బాబా అందరి మనసులలో పాదుకొనునట్లు చేసెను. అయినను సన్నిహితులైన భక్తులకు బాబా ఆహారమును మానివేయుట తీవ్రమైన విషయముగా అనిపించి ఆందోళన చెందుచుండిరి. అందుచే వారు రాత్రి పూట కూడ బాబాను కనిపెట్టుకుని మసీదులోనే నిద్రించుచుండిరి. 14వ తేదీ అర్ధరాత్రి బాబా అంత తీవ్ర అనారోగ్యములో వున్నను. లేచి బిగ్గరగా

కేకవేసి సటకాతో నేలపైకొట్టెను. ఆ శబ్దమునకు అందరూ లేచిరి. అమరావతిలోని ఖపర్దే యింటికి దొంగలు వచ్చిరి. వారిని అదలించి చెదర కొట్టితినని చెప్పెను. అలాంటి ఆఖరి స్థితిలో కూడ బాబా తన భక్తుల గురించే ఆలోచించుచుండెను గాని తన గురించి ఆలోచించలేదు.

ఆఖరి రోజు

అది 1918వ సంవత్సరం అక్టోబరు నెల 15వ తేదీ మంగళవారము. బాబా భౌతిక శరీరమునకు ఆఖరి రోజు. సూర్యుడు మామూలుగనే ఉదయించెను. ఆ రోజు విజయ దశమి (దసరాపండుగ) బాబా శారీరకంగా చాలా నీరసించిపోయెను. సామాన్య మానవులైనచో లేచి కూర్చొనుటే కష్టమయ్యేడిది. బాబా మామూలుగా లేచి తన స్థానములో యధావిధిగా కూర్చొనెను. మామూలుగానే భక్తులు దర్శనమునకు వచ్చిరి. శ్యామా కొందరిని బాబా ఆరోగ్యము బాగాలేదని, మసీదు బయట నుంచే దర్శనము చేసుకొనుడని వారించెను. బాబా దానిని అంగీకరించక అందరినీ వచ్చి తన పాద దర్శనము చేసుకోమని చెప్పెను. భక్తులందరూ వెళ్ళి నమస్కరించిరి. వారి వరదహస్తమును భక్తుల తలపై వుంచి ఆశీర్వదించి వూదీ ప్రసాదమిచ్చి అందరినీ ఆశీర్వదించిరి. అదేమో తెలియదు కాని సన్నిహిత భక్తులందరూ కూడ ఒకరి వెంట ఒకరు బాబా పాదములపై పడెను. వారందరికీ ఎవరికి అవసరమైన సలహాలను సూచనలను వారికిచ్చెను. అవి మామూలు సలహాలుగానే వారు భావించిరి గాని వాటిని బాబా తన భౌతిక శరీరంతో యిచ్చే తుది సూచనలుగా వారు గ్రహించలేక పోయిరి. జ్యోతిష్కుడు, భక్తుడు అయిన లక్ష్మణ్ మామాచే మసీదులో కొంతసేపు భగవన్నామమును చేయించెను.

సమయము ఉదయం 11 గంటలు కావస్తున్నది. తాత్యా క్షణ క్షణమునకు రక్తము క్రక్కుచూ అపస్మారక స్థితిలోనికి పోయెను. నాడి కూడ బలహీనమయ్యెను. బాబా చెప్పిన ప్రకారము తాత్యా ఆ రోజు మరణించునని రామచంద్రపాటిల్, బాలా షింపిలు భయపడుచుండిరి. శ్యామాను తీసుకువెళ్ళి అతని పరిస్థితినీ చూపించిరి. అతడు కొద్ది క్షణములలో మరణించునని శ్యామా పరుగెత్తుకుని బాబా వద్దకు వచ్చెను. తాత్యా స్థితిని వివరించి అతనిని కాపాడుటకు బాబా వెంటనే రావలెనని ప్రార్థించెను. బాబా శ్యామాను ఓదార్చుతూ ఏకాదశి ఘడియలు రాగానే తాత్యాకు ప్రమాదము తప్పునని, అతనిని గురించి భయపడవలసిన అవసరంలేదని చెప్పెను. అయినను

బాబా ఒకసారి వచ్చి చూచిన బాగుండునని శ్యామా పట్టుపట్టెను. అప్పుడు బాబా శ్యామాతో మీ అందరికీ తాత్యా విషయంలో స్నేహ బంధమే వున్నది. కాని నాకు అతని విషయంలో బాధ్యత కూడ వున్నది. అతని తల్లిబయజాబాయి మరణించు నప్పుడు అతనిని నా ప్రాణంతో సమానంగా చూసుకొనెదనని మాట యిచ్చితిని. ఆ తల్లి నాకు చేసిన సేవనుగాని, ఆమెకు ఆనాడునేనిచ్చిన మాటను గాని ఎట్లు మరువగలను. నీవు కంగారు పడవద్దు. తాత్యాను రక్షించుటకు నేను అక్కడకే వెళ్ళవలసిన అవసరం లేదని చెప్పగా శ్యామా శాంతించెను. సమయం మధ్యాన్నం పన్నెండు గంటలగుచున్నది. మధ్యాన్న ఆరతికి ఏర్పాట్లు జరుగుచున్నవి. బాబాలో ఏదో దివ్యతేజస్సు ప్రవేశించినట్లుగా అనిపించెను. ఆరతి ప్రారంభించబడెను. ఆరతి జరుగుతున్నంత సేపు బాబా ముఖకవళికలు క్షణక్షణం మారిపోవుచుండెను. వారిని చూచిన వారికి మనస్సు శాంతించి తదేక దృష్టితో వారిని అలాగే చూడాలనిపించెను. ఆ సమయంలో అక్కడున్న వారందరికీ బాబా వేరు వేరు రూపములతో కనిపించెను. మారుతిగా, పాండురంగనిగా, దత్తాత్రేయునిగా, రామునిగా, మహమ్మదీయ భక్తులకు మక్కా మదీనా పుణ్యస్థలములుగా కనిపించెను. ఒక క్రైస్తవభక్తునికి ఏసుక్రీస్తుగా కనిపించెను. బూటీకి బాబా శ్రీకృష్ణునిగా తాను నిర్మించిన వాడాలో మురళివాయించుచున్నట్లు కనిపించెను. ఆ రోజు విజయదశమి కాబట్టి తన కుమారునికి అక్షరాభ్యాసం బాబాతో చేయిద్దామని వచ్చిన ఒక భక్తునికి బాబా విఘ్నేశ్వరునిగా కనిపించి ఓం అనే సంస్కృత అక్షరమును వ్రాసి ఆ బాలునికి చూపించి ఆశీర్వదించెను. ఈ విధముగా ఆ రోజు ఆరతి సమయంలో అక్కడ వున్న ప్రతిభక్తునికి వారి మనో భావముల ననుసరించి దివ్యదర్శనమును ప్రసాదించెను.

ఆరతి పూర్తి అయినది. సమయము వంటి గంట దాటుతున్నది. అందరిని త్వరగా వెళ్ళి పొమ్మని బాబా ఆదేశించెను. బాబా యొక్క దివ్య దర్శనానందంతో అందరూ తిరిగి యిళ్ళకు, వాడాలకు వెళ్ళిపోయిరి. ఉన్నట్టుండి బాబాకు తీవ్రమైన దగ్గువచ్చెను. దగ్గుతోపాటు నోటి నుంచి రక్తము కూడ తీవ్రముగా పడెను. అక్కడ తాత్యా రోగము కుదిరెను. నాడి మామూలుగా కొట్టుకొనెను. అతని శరీరములో ఏదో నూతన శక్తి ప్రవేశించెను. లేచి నిలబడెను. నడవగలిగెను, సంతోషముతో కేకలు వేసెను. కొద్ది క్షణముల వరకు స్పృహలేని తనకు యింతటిశక్తి ఎక్కడ నుంచి వచ్చిందో అతనికే అర్థంకాలేదు. చూసేవారు కూడ ఆశ్చర్యపడిరి. ఈ ఆశ్చర్యము నుంచి తేరుకొనక ముందే తాత్యాకు బాబా జ్ఞప్తికి వచ్చెను. తనకు పునర్జన్మ నిచ్చినవాడు బాబాయేనని తలచి పరుగున మసీదుకు వచ్చెను. అప్పటికే బాబా

భయ్యాజీ అప్పాజీ పాటిల్‌ను అనుకొను కూర్చుని అతని ఒక్కనికి మాత్రమే వినపడునట్లుగా రహస్యముగా ఏదో చెప్పెను. రహస్యము చెప్పుట పూర్తి అయిన తరువాత, దీనిని ఎవరికైనా చెప్పితివా నీవు మరణింతువని ఆజ్ఞాపించెను. ఆ మాటలను మాత్రము తాత్యా వినెను. బాబాకు తీవ్రముగా దగ్గు వచ్చుటచే రొప్పుచుండెను దగ్గునపుడు నోటి నుంచి రక్తము చిందరవందరగా ద్వారకామాయి అంతాపడుచుండెను. అంతకు ముందే భక్తులందరినీ ధైర్యముగా వుండుమని చెప్పి భోజనములకు బలవంతముగా పంపెను. అయినను కొందరు బాబాను వదిలి వెళ్ళుటకు నిరాకరించిరి. లక్ష్మీబాయి, భాగోజీ, అప్పాజీ, లక్ష్మణ్, బాలాషింపి మొదలైన వారు మాత్రము బాబా వద్ద కూర్చుని వుండిరి. తాత్యా బాబాకు నమస్కరించగా శ్యామాకు సైగచేసి అతనిని యింటి వద్దకు పంపి రమ్మనెను. శ్యామా తాత్యాను అతని యింటి వద్దకు చేర్చివచ్చెను. సమయము రెండు గంటలు కావస్తున్నది. మిగిలిన వారిని కూడ బాబా బలవంతముగా భోజనాలకు వెళ్ళమని పంపెను.

తొమ్మిది రూపాయలు దానం

లక్ష్మీబాయి షిండే, బయ్యాజీలు మాత్ర అక్కడే వుండిరి. లక్ష్మీబాయి బాబా పాదముల చెంతవుండెను. బాబా రెండుసార్లు తన కుడి చేతిని చొక్కాజేబులో వుంచి ఒకసారి 5 రూపాయలు యింకొకసారి 4 రూపాయలను ఆమెకు దానమిచ్చెను. ఈ తొమ్మది రూపాయలు భక్తునికి వుండవలసిన తొమ్మిది లక్షణములుగా బాబా వివరించెను. అవి 1. గర్వము లేకపోవుట 2. ఈర్ష్య లేకపోవుట 3. అలసటలేని కార్యదక్షత 4. విషయాసక్తిలేకపోవుట 5. గురువు యందు ప్రగాఢమైన విశ్వాసము 6. శాంత స్వభావము 7. సత్యము తెలుసుకొనుట యందు ఆసక్తి 8. అసూయ లేకుండుట 9. ఆత్మస్తుతి పరనింద లేకపోవుట. ఈ తొమ్మిది గుణములను అభివృద్ధిచేసుకొనినగాని భక్తుడు నిజమైన భక్తిని సాధించి దైవాన్ని చేరలేడని లక్ష్మీబాయికి బాబా తన తుది ఘడియలలో సైతం బోధించెను.

బాబా మహాసమాధి

దశమి ఘడియలు పోయి ఏకాదశి ప్రవేశించెను. సమయము మధ్యాన్నము రెండున్నర గంటలయ్యెను. బాబా బయ్యాజీని అనుకొనియుండి అతనితో నేను వెళ్ళుచుంటిని. నా ఈ శరీరమును బూటీ వాడాలో వుంచుడు. నేనక్కడే వుండి సర్వవేళలా మిమ్మలనందరినీ కాపాడుచుండెదనని చెప్పి అతని శరీరముపై

ఒరిగిపోయెను. వారు నేలమీద పడలేదు. తన గద్దెపైనను పడలేదు. తన బిడ్డలకు దాన మిస్తూ జ్ఞానబోధచేస్తూ తుదిశ్వాస వదిలిరి. యిది యోగులకు రాజైన యోగిరాజు మరణించిన తీరు. మృత్యువును శాసించగల కైలాసపతి మానవుడై పుట్టి తానే కోరి మృత్యువును ఆహ్వానించిన మహత్తర సన్నివేశం. బాబా శరీరం నుంచి దివ్యశక్తి వెలువడునప్పటికి అజ్ఞాత రూపంలో వున్న గురుధన్, ద్వారకామాయి, వెంకూసాల దివ్యజ్యోతులు మసీదులో చేరి సిద్ధంగా వున్నాయి. సాయి శరీరం నుంచి వెలువడిన జ్యోతితోపాటుగా ఆ మూడు జ్యోతులు కలిసిపోయి ఒకే ఒక సాయి దివ్యశక్తిగా మారిపోయింది. మళ్ళీ అది నాలుగు భాగాలుగా విడిపోయి ఒక భాగం గురుస్థాన్‌కు వెళ్ళి చేరింది, రెండవ భాగం చావడిలోకి వెళ్ళి స్థిరపడి పోయింది. మూడవ భాగం ద్వారకామాయిలో లయమైనది. నాల్గవ భాగం బూటీ వాడాలోకి చేరుకున్నది. ఈ దృశ్యాన్ని ఎవరూ చూడలేక పోయిరి. ఈ నాలుగు శక్తులు నాలుగు వేదాలకు ప్రతీకలు. ఈ భూమండలాన్నంతటినీ శాసించి అదుపులో వుంచగల సాయిశక్తికి నిదర్శనాలు. కైలాసాన్ని వదిలి వచ్చిన శివశక్తి షిరిడిలో నిక్షిప్తం అయింది. ఈ విధంగా షిరిడి మహా పుణ్యక్షేత్రమయ్యింది. ఎన్నో అద్భుత శక్తులను ప్రదర్శించి, ఆర్తులను రక్షించిన సాయి శరీరం ద్వారకామాయిలో పడివున్నది.

ద్వారకామాయిలోగల సాయి భౌతిక శరీరం యిక మనకు దొరకదు ఒక్కసారి మనం కూడ ఊహాలోకాలలో ద్వారకామాయికి వెళ్ళి ఆ ప్రభువు పాదాలను తాకి ఈ జన్మను సార్థకం చేసుకొనెదము గాక!

ఓం శాంతి శాంతి శాంతిః

ముప్పది మూడవ అధ్యాయం సంపూర్ణం

ముప్పది నాల్గవ అధ్యాయము

బాబా మరణించెనను వార్త క్షణాలలో షిరిడి మరియు చుట్టు ప్రక్కలగల గ్రామములలో వ్యాపించెను. పిల్లలు స్త్రీలతోసహా ప్రజలంతా ద్వారకామాయికి తరలివచ్చిరి. కదులుతూ మాట్లాడుతూవుండే దైవంగా పేరుగాంచిన సాయి నిర్జీవంగా పడివుండటం చూసిన వారి కంటి నుంచి కన్నీరు ధారలై కారుచుండెను. గొంతులు మూగపోయినవి. బాబా మృతశరీరాన్ని చూసిన వారికి ఒక్క క్షణం ఈ సృష్టి స్థంభించినట్లుగా అనిపించెను. బాబా లీలలు, మహిమలు, అనుభవాలను చవిచూడని ఒక్క యిల్లు కూడ షిరిడిలోగాని చుట్టు ప్రక్కలగాని లేదు. బాబా వారికి చేసిన మేలును తలచుకొని కొందరు బిగ్గరగా ఏడ్చుచుండిరి. కొందరు బాబా శరీరమును

చూచి స్పృహతప్పి పడిపోయిరి. కొందరు వీధులలో ఏడ్చుచు పరుగెత్తుచుండిరి. ఆ గ్రామ పరిసరములలో కన్నీరు కార్చని కళ్ళులేవు. రెండేళ్ళ క్రిందే సీమోల్లంఘనను సూచించి, తాత్యామరణమును తాను తీసుకుని, తన జీవితాన్ని తాత్యాకిచ్చినట్లుగా అందరికీ అర్థమయ్యెను. బాబా చేసిన వింత చర్యలను, వారి మాటలను గుర్తుకు తెచ్చుకుంటూ అనేక మంది మాట్లాడుకొనుచుండిరి. ఎనిమిది సంవత్సరముల తరువాత మద్రాసు రాష్ట్రములో జన్మించెదనని బాబా చెప్పినట్లుగా కొందరు చెప్పిరి. అప్పాజీకి చెప్పిన రహస్య విషయములు కూడ తన రాబోయే జన్మను గురించి వుండవచ్చునని చాలామంది ఊహించిరి. ఆ వివరములు ఎవరికీ చెప్పవద్దని బాబా కఠోర శాసనము చేసియుండుటచే ఎవరు ఎన్ని ప్రశ్నలు వేసినను అప్పాజి వివరములను ఎవరికీ చెప్పలేదు.

కొద్దిగంటల తరువాత బాబా శరీరమును ఏమి చేయవలెనను సమస్య వచ్చెను. కొందరు మహమ్మదీయులు బహిరంగ ప్రదేశములో బాబా శరీరమును సమాధి చేయవలెనని కోరిరి. కుశాల్‌చంద్, అమీరు షక్కరు కూడ వారి అభిప్రాయములనే సమర్థించెను. గ్రామ మునసబు రామచంద్ర పాటీల్ ధృఢ నిశ్చయమును తీసుకుని బాబా భౌతిక శరీరమును బూటీవాడాలోనే సమాధి చేయవలెనని అలాకాక యింకెక్కడ సమాధి చేయుటకు వీలులేదని గట్టి పట్టుబట్టెను. ఈ విధముగ షిరిడి గ్రామము రెండు వర్గములుగా ఏర్పడి బాబా సమాధి చేయు విషయమై వాదోపవాదములు పడుచుండిరి. మంగళవారం సాయంత్రానికే రహటా పోలీస్ సబ్‌యిన్స్‌పెక్టరు చక్రనారాయణ్ షిరిడికి వచ్చెను. బాబా శరీరమును తనిఖీ చేయగా వారి జేబులో ఏడు రూపాయలు మాత్రముండెను. ఆ రాత్రంతయు శరీరమును సమాధి చేయు విషయములో తర్జన భర్జనలు పడుచుండిరి.

16వ తేదీ బుధవారం తెల్లవారు ఝామున పండరీ పురములో వున్న దాసుగణుకు బాబా కలలో కనిపించి, మసీదు కూలిపోయినది తైలవర్తకులు యితరులు నాపై ఆగ్రహించినారు. నేను ఆ శరీరమును విడిచితిని. ఈ విషయము నీకు తెలుపుటకు వచ్చితిని. నీవు త్వరగా షిరిడి వెళ్ళి నా శరీరమును జాజిపూలతో కప్పుమని చెప్పెను. దాసుగణు వెంటనే తన శిష్య బృందముతో షిరిడికి బయలు దేరెను. 15వ తేదీ రాత్రి బొంబాయిలో గల ప్రధాన్ భార్యకు కలవచ్చెను. బాబా శరీరములో నుంచి ప్రాణములు బయటకు పోవుచున్నట్లు ఆమెకు కనిపించగా అయ్యో బాబా చనిపోవుచున్నాడని అరచెను. సాధువులను చనిపోవుచున్నారు

అనకూడదమ్మా? సమాధి చెందుచున్నారు అనవలెనని బాబా కలలోనే సమాధానమిచ్చెను. 16వ తేదీ రాత్రి మరల ఆమెకు కలలో కనిపించి నీ పెట్టెలో దాచిన ధనము అంతయు నాకు యిచ్చి వేయుమని కోరెను. మరునాడు పెట్టెలో నున్న ధనమంతయూ తీసి బాబా అంత్యక్రియల సందర్భముగా ఖర్చు పెట్టుటకు పంపెను. అదేరోజు రాత్రి ప్రధాన్ సోదరికి కలలో కనిపించి నా సమాధిపై కప్పుటకు పట్టు వస్త్రమును పంపుమని ఆదేశించగా- ఆమె కూడ అట్లే చేసినది. తెల్లవారితే బుధవారమనగా షిరిడిలో గల లక్ష్మణ మామా జ్యోషికి కలలో కనిపించి నేను మరణించితినని బాపూ సాహెబ్‌జోగ్ అనుకొనుచున్నాడు. నేను శరీరమును మాత్రమే వదిలితినిగాని జీవించియే వున్నాను. లెమ్ము కాకడ ఆరతి (సుప్రభాత ఆరతి) చేయుమని తెలిపెను. బాబా యందు గాఢ విశ్వాసము గల లక్ష్మణ మామా పూజా ద్రవ్యములు, ఆరతి సామాగ్రి తీసుకుని మసీదునకు వెళ్ళెను. కాపలాగా వున్న గ్రామ నౌకర్లు, పోలీసులు అడ్డుపడినా వారినందరినీ తోసుకుని ముందుకు వెళ్ళి బాబా శరీరమునకు మామూలుగానే ఆరతి యిచ్చెను. అతని మనో ధైర్యమును చూసి అడ్డగించుటకు ఎవ్వరూ సాహసించలేకపోయిరి. మధ్యాన్న ఆరతి బాపు సాహెబ్ జోగ్ యిచ్చెను. ద్వారకామాయిలో యిచ్చిన ఆఖరి ఆరతి అదే. బుధవారము ఉదయమునకు కోపర్‌గాం తహసీల్‌దారు కులకర్ణి గ్రామములో గల రెండు వర్గముల వారి అభిప్రాయాలను తెలుసుకుని వారి వారి అభిప్రాయములను సంతక సేకరణ ద్వారా తెలియ పరచమని కోరగా బూటీ వాడాలో సమాధి చేయవలెనన్న వారి సంఖ్య ఎక్కువగా వుండెను. అయినను అతడు ధైర్యము చేసి నిర్ణయము తీసుకోలేక అహమ్మద్‌నగర్ కలెక్టర్ సలహా ప్రకారము చేయ నిశ్చయించుకొనెను. కాని యింతలో బాబా ప్రేరణచే వ్యతిరేక వర్గము వారు కూడ బూటీ వాడాలోనే సమాధి చేయుటకు అంగీకరించిరి. బుధవారము సాయంత్రం 4 గంటల ప్రాంతంలో బాబా శరీరమునకు స్నానము చేయించుటకు వారు ధరించిన బారులాల్చీని తీయుటకు చేతులను అటూ యిటు వంచగా అవి మామూలుగానే వంగెను. సాధారణ శవములకు అట్లు వంగక అవయవములు కొయ్యబారును. ఒక పెద్ద బల్లపై శరీరాన్ని వుంచి ద్వారకామాయి ముందు కడవల కొద్దీ నీటిని అందరూ భక్తి శ్రద్ధలతో పోసిరి. తరువాత శరీరముపై పెద్ద తెల్లటి గుడ్డను కప్పిరి. పైన పూలను, గంధాక్షతలను చల్లిరి. సాయి శరీరమును ఆఖరిసారిగా తనివి తీరా చూసుకొనిరి. ప్రేమ కన్నీళ్ళును తెప్పించి, హృదయాన్ని

కలచి వేసినా కర్తవ్యాన్ని నిర్వహించుటకు మరల దానిని కఠినముగా చేయక తప్పదు. బూటీ మందిరంలోని భూగృహంలోపల మట్టిని త్రవ్వి బాబాశరీరమునకు సరిపడు ఆరడుగుల పొడవు గుంటను త్రవ్విరి. మేళ తాళములతో, బాజాభజంత్రీలతో బాబాశరీరమును ఊరేగింపుగా బూటీవాడా లోనికి తీసుకుని వెళ్ళిరి. లోపలి గుంటలో ముందుగా బాబా యొక్క పగిలిపోయిన యిటుకరాయిని ముక్కలుగా చేసివేసిరి. దానిపై మెత్తని పరువులను పరచిరి. దీక్షిత్, బూటీ, శ్యామా, మహల్సాపతిలాంటి భక్తులంతా కలిసి బాబా శరీరాన్ని పట్టుకుని లేపుచుండిరి. క్షణకాలంలో సాయి శరీరం కనుమరుగవబోతున్నది. ఈ భావనను సహించలేని అక్కడున్న వాళ్ళ కళ్ళ నుంచి కన్నీరు ఒక్కసారిగా పెల్లుబుకినది. నిశ్శబ్దం తాండవిస్తున్నది. దుఃఖ భారంతో శరీరం పట్టు తప్పిపోగా భక్తులందరూ కలిసినా బాబా శరీరాన్ని లేపలేకపోయిరి. దురాన్నుంచి చూస్తున్న మహా జనవాహిని హృదయాలు మౌనంగా ఆక్రోశిస్తున్నాయి. ముందుగా కొందరు గొయ్యి లోపలికి దిగి శరీరాన్ని క్రింద నుంచి పట్టుకొనిరి. మెల్లగా తలను లోపలికి దించిరి. తల భాగం లోపలకు వెళ్ళింది. అయ్యో బాబా వెళ్ళిపోతున్నాడు ఎవరో గుంపులో నుంచి హృదయం విదారకంగా అరిచారు. మెల్లగా కాళ్ళు కూడ లోపలకు దించుతున్నారు. సాయి యిక మనకు కనిపించడు యింకొక్కసారి చూద్దామనిపించి చుట్టూగల జనం ఎగిరిఎగిరి చూస్తున్నారు. శరీరం పూర్తిగా లోపలకు దిగింది. సుగంధ పరిమళాలను, అత్తరు, పన్నీరులను బాబా శరీరంపై చల్లారు. భక్తజన ఆక్రందనల మధ్య నుంచి చీల్చుకుని వచ్చినట్లుగా మట్టిని బాబా శరీరంపై వేసి పూడ్చుచుండగా జనం హాహాకారాలు చేశారు. ఏడ్చారు. కొందరు క్రిందపడి దొర్లారు. ఎంత విలపించినా సాయి శరీరం మట్టి లోపల పడిపూడిపోయింది. సమాధి అయింది. తప్పదు, తప్పదు, భగవంతుడే భూమికి దిగివచ్చి పుట్టినా మట్టిలో కలవక తప్పదు. యిది నిత్య సత్యమైన యదార్ధం.

సమాధిమందిరం

బూటీ జన్మధన్యమైనది అతడు నిర్మించిన వాడా బాబా యొక్క సమాధి మందిరమైనది. సాయంత్రము అయిదుగంటలకు సమాధిచేయుట పూర్తికాగానే బాబూసాహెబ్‌జోగ్, లక్ష్మణ మామూలు కలిసి సాయంత్రము యిచ్చు సూర్యాస్తమయ ఆరతిని 16-10-1918వ తేదీ బుధవారం బూటీ మందిరంలో మొట్టమొదటి సారిగా యిచ్చారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు అక్కడ బాబాకు నిత్యము నాలుగు ఆరతులు

జరుగుతూనే వున్నవి. బాబాకు బహిప్రాణమువలె వుండు నానావళి దూరముగా వుండిసాయి మహాసమాధిని గమనించి ఆనాటి నుంచి ఆహారం మాని 13వ రోజు తాను కూడ మరణించెను.

దాసుగణు గురువారము ఉదయమునకు షిరిడి చేరుకుని సమాధి దగ్గర రెండు రోజులు అఖండ హరినామ సంకీర్తన చేసెను. బాబా పేరున చాలా మందికి అన్నదానము చేసెను. బాబాసాహెబ్ భాటే, సాకోరిలో గల ఉపాసనీ బాబాలు బాబాకు అంత్యక్రియలు తదుపరి కర్మలను శాస్త్రోక్తముగ, యధావిధిగా చేసిరి. ఎక్కడ కృష్ణ విగ్రమును ప్రతిష్ఠించవలెనని బూటీ అనుకొనెనో అక్కడే సాయి శరీరముసమాధి చేయబడెను. ఈ విధముగా బాబా మురళీధరుడైనాడు. బాబాశరీరాన్ని తనలో యిముడ్చుకున్న బూటీ మందిరం పరమ పవిత్రమై, సత్ చిత్ ఆనందుములకు నిలయమై, శాంతి ధామమై కోట్లాది ప్రజలకు నిత్యశాంతిని ప్రసాదించుచున్నది.

ఓం శాంతి శాంతి శాంతిః
ముప్పది నాల్గవ అధ్యాయం సంపూర్ణం
ఏడవ రోజు పారాయణ ముగిసినది.

ఎనిమిదవ రోజు పారాయణ గురువారము

ముప్పది ఐదవ అధ్యాయము

సమాధి అయిన మరుసటి రోజున బాబా స్వయంగా లక్ష్మణ్ మామకు, దాసుగణుకు, ప్రధాన్ భార్యకు కలలో చెప్పినట్లుగానే వారు మరణించలేదు. కేవలం శరీరము మాత్రము వదిలినారు. లోపల గల దివ్య సాయిశక్తి ఆనాటి నుంచి ఈనాటి వరకు నిత్య జాగరూకతతో తన భక్తులను కాపాడుతున్న నిదర్శనలు ఎన్నెన్నో కలవు. సాయి యొక్క దివ్యశక్తికి షిరిడి కేంద్రస్థానంగా వున్నా అది ప్రకృతి అంతా నిండియున్న చైతన్యవంతమైన దైవశక్తితో నిండియున్నది. అందువలననే నిజభక్తులు ఎప్పుడు ఎక్కడ భక్తితో తలచి పిలిచిన అక్కడే ప్రత్యక్షమగుచున్నారు. నిజానికి సమాధి అనంతరమే బాబా తన శక్తులను, లీలలనువిశేషంగా చూపుతున్నారు.

యిందుకు అనేక నిదర్శనములు కలవు. కొందరు సాయి భక్తుల అనుభవములను, అభిప్రాయములను ఈ గ్రంథము ప్రారంభించుటకు ముందుగల పీఠికా విభాగంలో చదివియున్నారు. అలాంటి ఎందరో భక్తుల అనుభవములను దృష్టిలో వుంచుకొని ఆలోచించిన షిరిడిలో వెలసిన సాయిబాబా మరణించెనని అనుకొనుట చాలా పొరపాటగును. వారు ఈనాటికీ సజీవులే. వారు నిజంగా జీవించియుంటే వారిని చూడగలుగుట, వారి మాటలను వినగలుగుట, వారి అనుగ్రహమును పొందగలుటకు ఏమి చేయవలెను? అనే సందేహం భక్తులకు రావచ్చును. పవిత్రమైన హృదయంతో సాయిబాబాను పూర్తిగా నమ్మవలెను. వారి జీవిత చరిత్రను తరచుగా పారాయణ చేయుచుండవలెను. ప్రతిరోజున ఉదయము లేచినది మొదలు చేయు ప్రతి పనిని వారికీ చెప్పి చేయుచుండవలెను. పంచేంద్రియములతో అనుభవించు ప్రతి ఆనందము లేక దుఃఖమును కూడ బాబాకు సమర్పించిన తరువాతనే మనం అనుభవములను తీసుకొనవలెను. సాయిబాబా పటం మన యింటిలో వుంటే వారు సశరీరంగా మన యింటిలో అదనంగా యింకొక మనిషివలె వున్నట్లుగానే భావించి మనిషికీ చేయు పనులన్నీ వారికీ చేయుచుండినచో వారు తప్పక మన యింటిలో నివాసముండగలరు. యిది నూటికీ నూరుపాళ్ళు సత్యము. ధన సంబంధమైన అట్టహాసములతో చేయు పూజలే ప్రధానము కాదు. మనమనసు ఒక గుడిగా చేసుకుని అందులో సాయి రూపాన్ని ప్రతిష్ఠించి నిత్యము హృదయ వాసి అయిన సాయితో అంతర్లీనమగు వారికీ సాయి సర్వదా లోబడి యుండును. అలాంటి పవిత్ర, నిర్మల భక్తులకు సాయి బానిసయగును. భక్తులపై వారికీ అంత ప్రేమ. సాయి యొక్క ప్రేమాభిమానములను ఒక్కసారి రుచి చూసిన వారు వారి జీవితమును సాయి పాదములపై అర్పించుటకు కూడ వెనుకాడరు. సాయి ప్రేమను వర్ణించుటకు మాటలు చాలవు. వారి శక్తిని వూహించుటకు కూడ మన బుద్ధికి గల శక్తిచాలదు.

అలాంటి ప్రేమ స్వరూపుడు సమర్థుడైన సాయిని మన కుటుంబములో ఒక భాగస్వామిగా చేసుకుని, మన జీవితానికి ఒక ఆధారంగా చేసుకుని మన సర్వస్వం సాయికి సమర్పణ చేసి ఈర్ష్యా, ద్వేషాలకు లొంగక, అహంకార మమకారాలకు దూరంగావుంటూ మనకున్నంతలో హీనులకు దీనులకు సహాయపడుతూ వుండినచో మన కుటుంబ భారములను సర్వం సాయి మోస్తూ మనకు వెంటగా, జంటగా వుండి మనలను సక్రమమైన మార్గంలో నడుపుతూ జీవితగమ్యాన్ని చేర్పగల

గురు రూపుడు బాబా. అదే సాయి యొక్క అవతారలక్ష్యం. సాయి మహిమలు రోజు రోజుకు పెరుగుతూ మనదేశంలోనేకాక ప్రపంచంలోని నాలుగు పెద్ద ఖండాలలోగల ప్రజలందరినీ రాగల 500 సంవత్సరములపై వరకు ప్రభావితులను చేసి జాతి, కుల, మత విచక్షణలు లేని వసుధైక కుటుంబముగా సాయి శాంతి సామ్రాజ్యం స్థాపించబడుగాక!

ఓం శాంతి శాంతి శాంతిః

ముప్పది అయిదవ అధ్యాయము సంపూర్ణం.

పారాయణ ఫలితం

శ్రీ షిరడి సాయిబాబా జీవితచరిత్ర అనే ఈ పుస్తకము బాబా లీలలతోను బోధనలతోను నిండిన పారాయణ గ్రంథము. సాయిబాబా బోధలన్నీ వేదరహస్యాలు. వేదవేదాంగములలో గల గొప్ప ఆధ్యాత్మిక విషయాలను చిన్న చిన్న అనుభవ పూర్వకమైన కథల ద్వారా సామాన్యులకు అందించాడు సాయి. వారి జీవితము మనకొక ఆధ్యాత్మిక పాఠశాల.

ఏ విధమైన భౌతిక సమస్యల గురించైనా ఈ జీవితచరిత్రను పారాయణ చేసినచో వారి వారి భక్తి శ్రద్ధలను బట్టి ఆయా సమస్యలు పరిష్కరించబడును. భౌతికమైన విషయములను గురించి కాక కేవలము ఆధ్యాత్మిక వికాసము కొరకు దీనిని పారాయణ చేసినచో యిది దివ్య ఔషదమువలె పనిచేయును. ప్రేమకు ప్రతి రూపుడైన సాయి దీనిని పారాయణ చేయు ప్రతి వారికీ సన్మార్గమును చూపుగాక! సద్గతి కలిగించుగాక! వారి జీవితములలో శాంతి సౌఖ్యములను నింపుగాక! వారిని అన్ని వైపుల నుంచి రక్షించుగాక!

సర్వేజనా సుఖినోభవంతు
లోకా సమస్తా సుఖినోభవంతు.
ఓం శాంతి శాంతి శాంతిః